



చురుగ్గా సాగుతున్న ఏర్పాట్లు



అనంతపురం నగరంలో వెలసిన ఫ్లెక్సీలు



ఏర్పాట్లను పరిశీలిస్తున్న డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా

సూపరో సూపర్..!

హిట్ కొట్టేందుకు శరవేగంగా ఏర్పాట్లు

- అనంతలో తిష్టవేసిన మంత్రులు, నాయకులు
- భద్రతపై డీజీపీ హరీష్ కుమార్ గుప్తా సమీక్ష
- నేడు జిల్లాకు చేరనున్న కూటమి కీలక నాయకులు
- మూడు పార్టీల జెండాలు.. ఫ్లెక్సీలతో స్వాగత ఏర్పాట్లు
- నేటి నుంచి పోలీసుల నిఘా నీడలోకి అనంతపురం
- రేపు సూపర్ సిక్స్.. సూపర్ హిట్ విజయోత్సవ సభ

అనంతపురం క్రైం, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): మహా సంరంభానికి అనంత వేదిక కాబోతోంది. మరో 24 గంటల్లో.. 15 నెలల కూటమి ప్రభుత్వం అందించిన 'ప్రజల కలల ఫలాల' విజయోత్సవం జరగబోతోంది. రాష్ట్ర ప్రగతి రథసారథి, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సహా కేంద్ర, రాష్ట్ర మంత్రులు, ప్రజా ప్రతినిధులు, కీలక నాయకులకు ఆతిథ్యం ఇచ్చేందుకు అనంత సిద్ధమైంది. 'సూపర్ సిక్స్ - సూపర్ హిట్' పేరిట బుధవారం జరిగే ఈ వేడుకకు అనంత వీధులన్నీ ముస్తాబయ్యాయి. నగర వ్యాప్తంగా కూటమి పార్టీల జెండాలు కలిసి రెపరెపలాడుతున్నాయి. తమ ప్రియతమ నాయకులకు ఘన స్వాగతం పలికేందుకు పార్టీ జెండాలు, ఫ్లెక్సీలు, బెలూన్లతో తోరణాలను ఏర్పాటు చేశారు. ఇప్పటికే పది మందికి పైగా మంత్రులు, 30 మంది వరకూ ఎమ్మెల్యేలు, 5 వేల మందికి పైగా నాయకులు, కార్యకర్తలు జిల్లా కేంద్రంలో వాలిపోయారు. పలువురు కేంద్ర, రాష్ట్ర మంత్రులు, మూడు పార్టీల నాయకులు



మ్యాప్‌ను పరిశీలిస్తున్న డీజీపీ, మంత్రులు నారాయణ, కేశవ్, అనగాని

మంగళవారం అనంతకు చేరుకోనున్నారు. బహిరంగ వేదిక, గ్యాలరీలు, హెలీప్యాడ్‌లు, భద్రతా ఏర్పాట్లు దాదాపు పూర్తయ్యాయి.

సందడే సందడి..

సూపర్ సిక్స్-సూపర్ హిట్ కోసం వచ్చినవారితో అనంతపురం నగరంలో సందడి నెలకొంది. ఉమ్మడి జిల్లాతోపాటు ఇతర ప్రాంతాల ఎమ్మెల్యే, కీలక నాయకులు ఇక్కడి ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. కొందరు క్షేత్రస్థాయిలో పర్యటించి.. ప్రజలను ఆహ్వానిస్తున్నారు. నియోజకవర్గాలలవారీగా నాయకులు, కార్యకర్తలతో సమావేశాలు నిర్వహిస్తున్నారు. ప్రజలు స్వచ్ఛందంగా తరలివచ్చేలా చైతన్యపరుస్తున్నారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, టీడీపీ, బీజేపీ, జనసేన రాష్ట్ర నాయకుల వెంట వచ్చిన వారితో నగరం కిటకిటలాడుతోంది. అనంతపురం నగరం, సమీప ప్రాంతాలలోని హోటళ్లు, లాడ్జిల గదులన్నీ ఇప్పటికే బుక్ అయ్యాయి. నగరంలోని కల్యాణ మండపాలు, ఫంక్షన్ హాళ్లు సైతం ముందే బుక్ అయ్యాయి. సుమారు 25 మంది వరకూ మంత్రులు మంగళవారం సాయంత్రానికి అనంతపురం వచ్చే అవకాశం ఉంది.

శరవేగంగా ఏర్పాట్లు

శ్రీనగర్ కాలనీలోని జీఎంఆర్ ఇంద్రప్రస్థ గ్రౌండ్స్‌లో సభకు ఏర్పాట్లు శరవేగంగా సాగుతున్నాయి. సభావేదిక పూర్తిగా సిద్ధమైంది. అన్ని గ్యాలరీలను సిద్ధం చేశారు. వేదిక వెనుక వైపు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, యువనేత లోకేష్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ విశ్రాంతి కోసం ప్రత్యేక టెంట్‌లను సిద్ధం చేశారు. మంత్రులు, ఎమ్మెల్యేల కోసం మరో టెంట్‌ను సిద్ధం చేశారు. మొత్తం వేదిక, గ్యాలరీలు, అనంతపురం నగరంలోని ట్రాఫిక్, సెక్యూరిటీ, పార్కింగ్ తదితర ప్రాంతాల్లో భద్రతను సీసీ కెమెరాల ద్వారా పర్యవేక్షించేందుకు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఒక టెంట్‌లో ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేశారు. సభా వేదిక వైపు వెళ్లే శ్రీనగర్ కాలనీ, రాంనగర్ ఫ్లై ఓవర్, సప్తగిరి సర్కిల్, సుభాష్ రోడ్డు, బళ్లారి, రుద్రంపేట బైపాస్ ప్రధాన రహదారులు, నగరంలోని అన్ని ప్రధాన రహదారులు, సర్కిళ్లు మూడు పార్టీల జెండాలు, ఫ్లెక్సీలతో నగరానికి కొత్తశోభ సంతరించుకుంది.

రేపు ట్రాఫిక్ మళ్లింపు
సీఎం పర్యటన నేపథ్యంలో పోలీసుల ఆంక్షలు

6

అప్రమత్తంగా ఉండండి
ఐపీఎస్‌లకు డీజీపీ ఆదేశం



వేలాది మంది పోలీసులు

సీఎం సహా కీలక ప్రజా ప్రతినిధులు, మూడు పార్టీల నాయకులు వస్తుండటంతో అనంతలో భారీ భద్రత ఏర్పాటు చేశారు. డీజీపీ హరీష్ కుమార్ గుప్తా రెండు రోజుల ముందే నగరానికి చేరుకుని భదతను పర్యవేక్షిస్తున్నారు. ఐజీ, డీఐజీల సహా 30 మందికి పైగా ఐపీఎస్ అధికారులు, సుమారు 6 వేల మంది వరకూ పోలీసు సిబ్బంది బందోబస్తులో పాల్గొంటున్నారు. సభా ప్రాంగణం, హెలీప్యాడ్‌ల సహా నగరం మొత్తం మంగళవారం నుంచి పోలీసు శాఖ నిఘా నీడలోకి వెళ్లనుంది.

బీసీల చదువు పట్ల జగన్ నిర్లక్ష్యం

- సూపర్ హిట్‌ను జీర్ణించుకోలేకే ఆరోపణలు
- 110గురుకులాల్లో 700స్మార్ట్ పేఫోన్‌ల ఏర్పాటు
- బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత



మంత్రి ఎదుట కుటుంబ సభ్యులతో స్మార్ట్‌పే ఫోన్‌లో మాట్లాడుతున్న విద్యార్థి

పెనుకొండ టౌన్, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): బీసీ విద్యార్థుల చదువు, హాస్టళ్ల పట్ల మాజీ ముఖ్యమంత్రి జగన్ నిర్లక్ష్యం వహించారని బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత ఆరోపించారు. పెనుకొండలోని ఎంజేపీ గురుకుల పాఠశాలలో ప్రభుత్వ చీఫ్‌విప్ ఆంజనేయులు, నియోజకవర్గ ఎన్నికల పరిశీలకులు నరసింహారావుతో కలిసి ఆమె సోమవారం స్మార్ట్ పేఫోన్‌లను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ బీసీ బిడ్డలు ఉన్నత విద్యను అభ్యసించాలనే లక్ష్యంతో దివంగత ఎన్టీఆర్ రాష్ట్రంలో గురుకుల పాఠశాలల ఏర్పాటుకు నాంది పలికారన్నారు. ఆయన స్ఫూర్తితో ముఖ్యమంత్రి చంద్రబాబు బీసీలకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు వెల్లడించారు. ఆ వారసత్వంగానే విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ హాస్టళ్లలోని విద్యార్థులు తమ తల్లిదండ్రులతో మాట్లాడుకునే

(మిగతా 6లో...)

ఏళ్ల తరబడి..

ఎదురుచూపులు..!

- ట్రాన్స్‌ఫార్మర్ల కోసం రైతులకు తప్పని తిప్పలు
- అమ్యామ్యాలు ముట్టజెబితేనే అంచనాలు
- డీడీలు తీసి ఏళ్లు గడుస్తున్నా.. మంజూరుకాని దుస్థితి
- కార్యాలయాల చుట్టూ అన్నదాతల ప్రదక్షిణ
- ఆరు వేలకు పైగా దరఖాస్తులు పెండింగ్



కరువు రైతు ఇన్నాళ్లకు నీళ్లు చూస్తున్నాడు.
హంద్రీనీవా కాలువ నీటితో చెరువులు నిండాయి.
బోరుబావులు తవ్వుకుని.. పంటలు పండించుకుని..
అప్పుల నుంచి బయటపడదామని ఆశిస్తున్నాడు.
మరింత అప్పు చేసి.. బోర్లు వేయిస్తున్నాడు.
మోటారు, ఇతర సామగ్రి సిద్ధం చేసుకున్నాడు.
విద్యుత్ కనెక్షన్ ఇస్తే.. పంట పెట్టుకుంటాడు.
ఇందుకోసం డీడీ తీసి.. ఎదురుచూస్తున్నాడు.
పంట పెట్టుబడుల కోసం చేసిన పాత అప్పులు..
బోరుబావి తవ్వకానికి.. ట్రాన్స్‌ఫార్మర్ డీడీ కోసం చేసిన కొత్త రుణాలు..
మోపెడయ్యాయి. వడ్డీలు భారమవుతున్నాయి.
అయ్యా..! ట్రాన్స్‌ఫార్మర్ మంజూరు చేసి.. విద్యుత్ కనెక్షన్ ఇస్తే..
పంటలు పండించుకుంటానని అధికారులను వేడుకుంటున్నాడు.
ఎవ్వరూ వినరు..! కరువు రైతు ఏ ఒక్కరూ పట్టించుకోరు..!

ధర్మవరం రూరల్/యాడికి, సెప్టెంబరు8(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్ల కోసం రైతులు ఎదురు చూస్తున్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న రైతులు, అంచనాలు వేయించుకుని డబ్బులు చెల్లించి ఏళ్లు గడుస్తున్నా అధికారులు ట్రాన్స్‌పార్మర్లు మంజూరు కావట్లేదు. పంట పండించుకునేందుకు నీళ్లు ఉన్నా.. వాటిని వినియోగించుకునే పరిస్థితి లేదని జిల్లాలోని పలువురు రైతులు పేర్కొంటున్నారు. జిల్లావ్యాప్తంగా 70శాతం మంది వ్యవసాయం మీద ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. విద్యుత్ కనెక్షన్లు లేక రైతులు.. భూములను బీళ్లుగా పెట్టుకున్నారు. ట్రాన్స్‌ఫార్మర్ల కోసం కాళ్లరిగేలా తిరిగినా అధికారుల నుంచి స్పందన లేదు. దీంతో పంటలు పెట్టుకోలేమనే ఆందోళన రైతుల్లో నెలకొంది. 'ఎప్పుడొస్తాయో.. చెప్పండి సార్..' అంటూ అధికారుల వద్ద మొర పెట్టుకున్నా.. వారి నుంచి తమకే తెలియదనీ, దరఖాస్తులు ఉన్నతాధికారులకు పంపామని చెప్పి, తప్పించుకుంటున్నారు. డీడీలు చెల్లించకుండా ట్రాన్స్‌పార్మర్ కోసం విద్యుత్ కార్యాలయాల చుట్టూ రైతులు ప్రదక్షిణ చేస్తున్నా.. అధికారులు కనీస కనికరం చూపలేదని పలువురు రైతన్నలు గగ్గోలు పెడుతున్నారు. ఇటీవల భూగర్భ జలాలు పెరిగాయి. దీంతో రైతులు బోర్లు వేసుకుని, పంటలు పండించుకోవాలని భావిస్తున్నారు. నీరు పుష్కలంగా (మిగతా 6లో...)

లైబ్రరీతో విజయం అభినందనీయం

జిల్లా గ్రంథాలయ కార్యదర్శి రమ



టీచర్ ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులను సత్కరిస్తున్న గ్రంథాలయ కార్యదర్శి రమ, ఇతర ఉద్యోగులు

అనంతపురం విద్య, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయంలో పోటీ పరీక్షల పుస్తకాలు చదివి, డీఎస్సీలో టీచర్ ఉద్యోగాలు సాధించడం అభినందనీయమని జిల్లా గ్రంథాలయ కార్యదర్శి రమ కొనియాడారు. అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవాన్ని సోమవారం జిల్లా గ్రంథాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా స్థానిక గ్రంథాలయానికి రోజూ వచ్చి, పుస్తకాలు చదివి డీఎస్సీలో టీచర్ ఉద్యోగం సాధించిన హరీష్, హరికృష్ణ, రాజేష్, పవన్‌కళ్యాణ్, నందకిషోర్, సోమశేఖర్, వీణ, ఆంజనేయులు, రాఘవరెడ్డిలను ఆహ్వానించి సత్కరించారు. ఈసందర్భంగా జిల్లా సెక్రెటరీ రమ మాట్లాడుతూ జిల్లాగ్రంథాలయంతో పాటు అన్నిగ్రంథాలయాలలోను నిరుద్యోగ యువతకు పోటీపరీక్షలకు సంబంధించిన పుస్తకాలు అనేకం అందుబాటులో ఉన్నాయన్నారు. వాటిని సద్వినియోగం చేసుకుని మంచి ఫలితాలు సాధించాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ లైబ్రేరియన్ కమ్మన్న, డాక్టరు బృంద, రిటైర్డ్ టీచర్ శ్రీరాములు, లైబ్రరీ గోవింద్ ఇతర ఉద్యోగులు పాల్గొన్నారు.

తుది దశకు..

- పూర్తి కావస్తున్న డీఎస్సీ ఎంపిక ప్రక్రియ
- డ్యుయల్ పోస్టుల స్థానంలో మరొకరికి అవకాశం
- నేడో.. రేపో.. కాల్ లెటర్లు
- ఆ తర్వాత కటాఫ్‌తో జాబితా

7

ఖజానా శాఖలో ఏక్ నిరంజన్..!

- ఆయన కనుసన్నల్లోనే పనులు
- ఉన్నతాధికారికీ ఆయన మాటే వేదం
- ఇన్‌చార్జ్ డీడీ పాలనలో ఇష్టారాజ్యం
- అరియర్ నుంచి అంత్యక్రియల బిల్లు వరకు..
- 5 నుంచి 10 శాతం కమీషన్ ఇవ్వాల్సిందే

అనంతపురం కలెక్టరేట్, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ విభాగాల్లో అవినీతి గురించి మాట్లాడినప్పుడు రెవెన్యూ, పోలీస్, రిజిస్ట్రేషన్ శాఖల పేర్లు వినిపిస్తుంటాయి. కానీ కనిపించని నాలుగోది ఖజానా శాఖ. ప్రభుత్వ శాఖల్లో పని చేసే చిరుద్యోగి నుంచి ఉన్నతాధికారి వరకు తన శాలరీ బిల్లు ట్రెజరీ, అకౌంట్స్ శాఖ నుంచి రావాల్సిందే. ఉద్యోగుల అరియర్స్ బిల్లు, సప్లిమెంటరీ బిల్స్, ఎర్న్ లీవ్స్, మెడికల్ బిల్లులు, పెన్షన్ ఇలా.. ప్రతి ఒక్క బిల్లుకూ చివరిగా మోక్షం కలగాల్సింది ఆ శాఖలోనే. అక్కడ ప్రతి బిల్లు పాస్ కావాలంటే పైసలు ముట్టజెప్పాల్సిందే. ఇలాంటి లెక్కలు మింగే శాఖలో ఓ అధికారి అత్యంత కీలకంగా వ్యవహరిస్తున్నారు. ఒక్క మాటలో చెప్పాలంటే అక్కడ ఏక్ నిరంజన్ పాత్ర పోషిస్తున్నారు. 70 శాతం ఆ సబ్ ట్రెజరీ ఆఫీసర్ కనుసన్నల్లోనే జరుగుతుంది. ఉన్నతాధికారి ఇన్‌చార్జ్‌గా ఉండటం, ఆయన ఎప్పుడో ఒకసారి రావడం ఈయనకు కలిసొచ్చింది. దీంతో పై అధికారికి కూడా ఈయన చెప్పిందే వేదంగా మారిందనే ఆరోపణలు ఉన్నాయి. ఆయనకు ప్రతి నెలా ముడుపులు అందుతాయి.

ఎందరో బాధితులు..

- అధికారులు, ఉద్యోగులు తనకు వచ్చే జీతంలో పొదుపు చేసిన డబ్బును కూడా తీసుకోలేని పరిస్థితి. ఓ శాఖలో పనిచేసే అధికారి గవర్నమెంట్ ప్రావిడెంట్ ఫండ్ (జీపీఎఫ్)కు సంబంధించి రూ.6లక్షల బిల్లు కోసం రూ.60వేలు ముట్టజెప్పాల్సి వచ్చింది.
- పన్నుల శాఖకు చెందిన ఓ ఉద్యోగి మృతి చెందాడు. ఆ ఉద్యోగి అంత్యక్రియల కోసం ప్రభుత్వం రూ.25వేలు అందజేస్తుంది. ఆ బిల్లు కోసం ట్రెజరీ శాఖలో రూ.2500 తీసుకున్నారు.
- మత్స్యశాఖకు సంబంధించి రూ.లక్ష బిల్లు పాస్ చేయించుకోవడానికి ఓ ఉద్యోగి రూ.10వేలు ముడుపులు అందజేశాడు.



ఖజానా కార్యాలయం

- ఓ శాఖలో పనిచేస్తున్న అధికారి మూడు నెలలు సెలవు పెట్టారు. తిరిగి విధుల్లో చేరాక అరియర్స్ బిల్లు కోసం రూ.5వేలు చెల్లించారు.
- సప్లిమెంటరీ బిల్స్, టీఏ, డీఏ అరియర్స్, మెడికల్ రీఎంబర్స్‌మెంట్ బిల్లులు, ఎన్‌క్యాష్‌మెంట్ బిల్లుల విషయంలో రూ.500 నుంచి రూ.4వేల వరకు వసూలు చేస్తుంటారు.
- ప్రతి శాఖ నుంచి అధికారులు వాడే అద్దె కార్లకు సంబంధించి ప్రతి నెలా బిల్లులు పెడుతుంటారు. ఒక్కో కారుకు రూ.250 నుంచి రూ.300 తీసుకుంటారు. తాజాగా ఓ శాఖకు సంబంధించి 24 కార్ల బిల్లుకు రూ.6వేలు వసూలు చేశారట.

సీట్ల నుంచి కమీషన్ల వరకు ఆదాయం

ఇన్‌చార్జ్ డీడీ కావడంతో ఈ ఏక్ నిరంజన్ వ్యవహారం ఇష్టారాజ్యంగా మారింది. డబ్బులొచ్చే సీట్లకు ఈ కార్యాలయంలో డిమాండ్ ఎక్కువ. తన పవర్ ఉపయోగించి ఎవరు డబ్బులిస్తే వారికి పెన్షన్, వెల్ఫేర్ చూసే సీట్లు అప్పగిస్తుంటాడు. కొంత మందికి బిల్లులు రాయడం కూడా తెలియదు. కానీ ఈయనే స్వయంగా బిల్లు రెడీ చేయడం, లేదా తన కోటరీతో రాయిస్తుంటారు. ఇలా బిల్లును బట్టి 5నుంచి 10శాతం వసూలు చేస్తారు. అద్దె కార్ల విషయంలో కొన్ని శాఖల నుంచి ప్రతి నెలా 30 లేదా 40లీటర్ల పెట్రోల్ తన కారుకు ఉపయోగించుకుంటారని తెలిసింది. ఈయన ఆదాయం ప్రతి నెలా రూ.2.50లక్షల నుంచి రూ.3లక్షల వరకు ఉంటుందని సమాచారం.

పెద్ద బిల్లుల్లో పైఅధికారితో బేరం

ఈ కార్యాలయంలో కీలకంగా ఉండాల్సిన పై అధికారితో పాటు ఎక్కువ మంది ఎస్‌టీఓలు ఖాళీగానే కనిపిస్తారు. కానీ ఈ ఏక్‌నిరంజన్ మాత్రం ఆఫీస్‌లో ఎప్పుడూ బిజీగానే ఉంటారు. వెల్ఫేర్‌కు సంబంధించి డైట్ బిల్లులు, మిడ్‌డే మీల్స్ రూ.లక్షల్లోనే ఉంటాయి. కార్యాలయానికి మూడు నెలలకోసారి పెట్టే బిల్లుల్లో కమీషన్ బాగానే ఉంటుందని సమాచారం. ఈ కార్యాలయానికి ప్రతి ఏటా అరియర్ బిల్లులు రూ.4కోట్ల నుంచి రూ.7కోట్ల వరకు, బడ్జెట్ బిల్లులు రూ.5 కోట్ల నుంచి రూ.7కోట్ల వర కు వస్తుంటాయి. ప్రభుత్వ పథకాలకు సంబంధించి.. వ్యవసాయ శాఖ, మత్స్య శా ఖల నుంచి రూ.15కోట్ల నుం చి రూ.20కోట్ల వరకు బిల్లులు పాస్ చేయాల్సి ఉంటుంది.

ఆ ఎస్టీఓదే రాజ్యం

అన్ని శాఖల లెక్కల వ్యవహారాలు నడిచే ఈ శాఖలో డిప్యూటీ డైరెక్టర్ ఉన్నతాధికారి. ప్రస్తుతం కడప ట్రెజరీ డీడీ ఇన్‌చార్జ్‌గా కొనసాగుతున్నారు. ఆయన పోలీస్ శాఖ మాత్రమే పర్యవేక్షిస్తారు. ఆ తరువాత అసిస్టెంట్ ట్రెజరీ ఆఫీసర్(ఏటీఓ) ఒకరున్నారు. సబ్ ట్రెజరీ ఆఫీసర్(ఎస్‌టీఓ)లు ఏడుగురు ఉన్నారు. వీరిలో ఓ ఎస్‌టీఓ ఇక్కడ స్పెషల్ ఆఫీసర్‌గా చలామణి అవుతుంటారు. ఈ కార్యాలయంలో 70శాతం ఆయన కనుసన్నల్లోనే నడుస్తుంది. ఓ ఇద్దరు సీనియర్ అకౌంటెంట్ల ద్వారా ఓ కోటరీ నడుపుతూ ఏకచక్రాధిపత్యం నడిపిస్తున్నారు. ఇది వరకు ప్రీ ఆడిట్ సెక్షన్‌లో ఉన్న సమయంలో అనేక ఆరోపణలు వచ్చాయి. అవినీతి నిరోధక శాఖ(ఏసీబీ)కి సైతం ఈయనపై పదుల సంఖ్యలో బాధితుల నుంచి ఫిర్యాదులు అందినట్లు సమాచారం.

ఆరోపణలపై విచారించాం



ఖజానా శాఖలో కమీషన్ల రూపంలో వసూలు చేస్తున్నారనే విషయంలో పలువురిపై ఫిర్యాదులు వచ్చాయి. వాటిపై విచారించి ఉన్నతాధికారులకు నివేదించాం. ఎవరూ ఖజానా శాఖకు రావాల్సిన అవసరం లేదు. గడువులోగా బిల్లుల ఫైల్స్ పూర్తి చేయాల్సి ఉంటుంది. కమీషన్లపై మరింత దృష్టి సారిస్తాం.

-వెంకటేశ్వర్లు, ఇన్‌చార్జ్ డీడీ, ఖజానా శాఖ

సూపర్ హిట్‌ను విజయవంతం చేయండి

బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొనకొండ్ల రాజేష్



మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొనకొండ్ల రాజేష్

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో ఈ నెల10న కూటమి ప్రభుత్వం నిర్వహించే సూపర్‌సిక్స్ - సూపర్ హిట్ సభను విజయవంతం చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొన కొండ్ల రాజేష్ పిలుపునిచ్చారు. స్థానిక బీజేపీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కొలువుదీరాక ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అమలు చేస్తూ సూపర్‌హిట్ చేశామన్నారు. వైసీపీ ప్రభుత్వంలో రాష్ట్రం ఆర్థికంగా నాశనం అయ్యిందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు అనుభవం, ప్రధాని మోదీ మద్దతుతో రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి చక్కగా జరుగుతోందన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాపు రామచంద్రారెడ్డి, కార్యదర్శి సందిరెడ్డి శ్రీనివాసులు, రాష్ట్ర సెల్స్ కన్వీనర్ చిరంజీవిరెడ్డి, ప్రొటోకాల్ ఇన్‌చార్జి పాతూరు నాగ భూషణ్, జిల్లా ప్రధాన కార్యదర్శులు అశోక్‌రెడ్డి, శ్రీదేవి, సీనియర్ నాయకులు రత్నమయ్య, ప్రతాప్‌రెడ్డి, లక్ష్మీదేవి, ఉపాధ్యక్షుడు మారుతిగోవిందు, కార్యదర్శి పోగుల నాగేంద్ర, ఐటీ సెల్ కన్వీనర్ భీమశేఖర్, మైనార్టీ మోర్చా రఫీ, చక్రధర్‌యాదవ్, ఓబీసీ నాగేంద్ర పాల్గొన్నారు.

సభను జయప్రదం చేద్దాం: వరుణ్



నాయకులతో చర్చిస్తున్న టీసీ వరుణ్

అనంతపురం న్యూటౌన్, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): నగరంలో ఈనెల 10న నిర్వహించనున్న సూపర్ సిక్స్. సూపర్ హిట్ సభను జయప్రదం చేద్దామని జనసేన జిల్లా అధ్యక్షుడు టీసీ వరుణ్ పిలుపునిచ్చారు. సోమవారం తన క్యాంపు కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. సభ విజయవంతానికి జన సైనికులు కృషి చేయాలన్నారు. సమావేశంలో నాయకులు రైల్వే కోడూరు ఎమ్మెల్యే శ్రీధర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్, కర్నూలు జిల్లా అధ్యక్షుడు సురేష్, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ భవాని రవికుమార్, సీనియర్ నాయకులు లక్ష్మీపతి, పత్తి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం సభకు 3,550 బస్సులు

ఆర్టీసీ జోనల్ చైర్మన్ పూల నాగరాజు



అనంతపురం క్రైం, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): నగరంలో నిర్వహించే సూపర్ సిక్స్-సూపర్ హిట్ సభకు తరలివచ్చే ప్రజల కోసం భారీగా బస్సులు ఏర్పాటు చేసినట్లు ఆర్టీసీ జోనల్ చైర్మన్ పూల నాగరాజు పేర్కొన్నారు. ఆయన స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో సోమవారం 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు. జూన్-3, జోన్-4 నుంచి సూపర్‌సిక్స్-సూపర్ హిట్ సభకు ఆర్టీసీ బస్సులు 3050 అందుబాటులో ఉంచుతున్నామన్నారు. జోన్-4 నుంచి 2,300, జోన్-3 నుంచి 750 బస్సులు వస్తాయన్నారు. మరో 500 వరకూ ప్రైవేటు బస్సులు అందుబాటులో ఉంచుతామని స్పష్టం చేశారు. ఈ 3,050 బస్సులను ఉమ్మడి అనంతపురం జిల్లాలోని 13 నియోజకవర్గాల నుంచీ సభకు వచ్చే ప్రజలకు అందుబాటులో ఉంచుతామన్నారు. రాయదుర్గం నియోజకవర్గానికి 180, ఉరవకొండ 300, గుంతకల్లు 300, తాడిపత్రి 240, శింగనమల 450, కళ్యాణదుర్గం 240, రాప్తాడు 450, మడకశిర 80, హిందూపురం 80, పెనుకొండ 180, పుట్టపర్తి 125, ధర్మవరం 300, కదిరికి 125 బస్సులు పంపుతామన్నారు. ప్రైవేటు బస్సుల్లో అనంతపురం అర్బన్‌లో 400, మడకశిరకు 50, పుట్టపర్తికి 50 అందుబాటులో ఉంచుతున్నట్టు ఆర్టీసీ జోనల్ చైర్మన్ పూల నాగరాజు తెలిపారు.

85 లక్షల టన్నుల చెత్తే జగన్ ఘనత

- మంత్రి నారాయణ



డంపింగ్ యార్డులో జరుగుతున్న బయోమైనింగ్ పనులను పరిశీలిస్తున్న మంత్రి నారాయణ, ఎమ్మెల్యే, అధికారులు

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): పన్ను వసూలు చేసి, రాష్ట్ర వ్యాప్తంగా 85లక్షల టన్నుల చెత్తను వదిలేసిన ఘనత మాజీ సీఎం జగన్‌కే దక్కిందని రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. గుత్తిరోడ్డులోని డంపింగ్‌యార్డులో జరుగుతున్న బయోమైనింగ్ పనులను సోమవారం ఆయన పరిశీలించారు. బయోమైనింగ్ ఇంజనీర్లు, మున్సిపల్, పబ్లిక్ హెల్త్ ఇంజనీర్లను అడిగి పనుల పురోగతిని తెలుసుకున్నారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం రూ.10లక్షల కోట్ల అప్పులతో పాటు, 85లక్షల టన్నుల చెత్తను వదిలేసి వెళ్లిందని విమర్శించారు. బయోమైనింగ్ ప్రారంభించిన నెల రోజుల్లోనే 60శాతం చెత్తను తరలించామని తెలిపారు. వైసీపీ పాలనలో కేంద్రం ప్రవేశాఎట్టిన అమృత్ పథకం కింద రాష్ట్రానికి రూ.8800కోట్లు నిధులు వచ్చినప్పటికీ, రాష్ట్రం మ్యాచింగ్ గ్రాంట్ ఇవ్వకపోవడంతో అవి వెనక్కివెళ్లిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఏపీ స్వచ్ఛాంధ్రప్రదేశ్ కార్పొరేషన్ చైర్మన్ పట్టాభిరామ్ మాట్లాడుతూ వైసీపీ వేసిన చెత్తను తరలించే ప్రక్రియను మరింత వేగవంతం చేస్తున్నామని తెలిపారు. ఏపీలో ఆరు క్రష్ వేస్ట్ ఎనర్జీ ప్లాంట్లు తీసుకొస్తున్నట్లు పేర్కొన్నారు. ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మాట్లాడుతూ 30ఏళ్లుగా పేరుకుపోయిన 2లక్షల టన్నుల చెత్తతో నిండిన డంపింగ్ యార్డు సమస్యకు సీఎం చంద్రబాబు పరిష్కారమార్గం చూపారని....అర్బన్ నియోజకవర్గంలోని ప్రజలంతా హర్షం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో అనంత నగరపాలక సంస్థ కమిషనర్ బాలస్వామి, ఎస్ఈ రాజశేఖర్, పబ్లిక్ హెల్త్ ఎస్ఈ రామ్మోహన్‌రెడ్డి, ఈఈ ఆదినారాయణ, ఏఎంసీ ఈఈ షాకీర్, డీఈలు, ఏఈలు, తదితరులు పాల్గొన్నారు.

టమోటా కిలో రూ.20

అనంతపురం రూరల్, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో సోమవారం కిలో టామోటాలు గరిష్ఠంగా రూ.20తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రూప్‌కుమార్ తెలిపారు. అదేవిధంగా కనిష్ఠ ధర రూ.15, సరాసరి ధర రూ.17తో విక్రయాలు జరిగాయన్నారు. మార్కెట్‌కు 1500 టన్నుల టమోటాలు వచ్చినట్లు పేర్కొన్నారు.



ఆకాశమంత పందిరి కింద.. అనంత నేలపై 'సూపర్ హిట్' అరుగు



రండి రండి రండి..! తమరి రాక మాకెంతో సంతోషం సుమండీ..!

అప్రమత్తంగా ఉండండి: డీజీపీ



మాట్లాడుతున్న డీజీపీ

అనంతపురం క్రైం, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి పర్యటన, సూపర్ సిక్స్- సూపర్‌హిట్ సభ, ప్రముఖుల పర్యటన నేపథ్యంలో అనుక్షణం అప్రమత్తంగా విధులు నిర్వర్తించాలని డీజీపీ హరీష్ కుమార్ గుప్తా ఐపీఎస్ అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో సోమవారం ఆయన లా అండ్ ఆర్డర్ అడిషనల్ డీజీ మధుసూదన్‌రెడ్డి, ఐజీలు, డీఐజీలు, ఐపీఎస్‌లతో కలిసి భద్రతపై సమీక్షించారు. సీఎం టూర్ సభాస్థలి వేదిక, హెలీప్యాడ్, పార్కింగ్ స్థలాల్లో బందోబస్తు, హైవేపై ట్రాఫిక్ మళ్లింపు, సీసీ కెమెరాల పనితీరు, డ్రోన్స్ నిఘా తదితర అంశాలపై జిల్లా ఎస్పీ జగదీష్ పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. అనంతరం డీజీపీ మాట్లాడుతూ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకూ తావు లేకుండా చర్యలు తీసుకోవాలని ఐపీఎస్‌లను ఆదేశించారు. విజయోత్సవ సభకు పెద్ద ఎత్తున ప్రజాప్రతినిధులు, ప్రజలు వస్తారని, ప్రతిక్షణం అప్రమత్తంగా ఉండాలన్నారు. నగరంలో ట్రాఫిక్ సమస్యలు లేకుండా చూడాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఆపరేషన్స్ ఐజీ శ్రీకాంత్, అనంతపురం రేంజ్ డీఐజీ షిమోషి, ఇతర డీఐజీలు సెంథిల్ కుమార్, కోయ ప్రవీణ్, గోపీనాథ్ జెట్టి, అమ్మిరెడ్డి, విజయరావు, సత్యఏసుబాబు, పక్కీరప్ప, అన్బురాజన్, శ్రీ సత్యసాయి జిల్లా ఎస్పీ రత్న, ఇతర ఎస్పీలు, అదనపు ఎస్పీలు పాల్గొన్నారు.

చరిత్రలో నిలిచిపోతుంది: కేశవ్



అనంతపురం క్రైం, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): సూపర్ సిక్స్-సూపర్ హిట్ సభ చరిత్రలో నిలిచిపోయేలా నిర్వహిస్తామని ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు. సభా వేదిక పనులను డీజీపీ హరీష్ కుమార్ గుప్తా, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, మంత్రులు అనగాని సత్యప్రసాద్, నారాయణ, గొట్టిపాటి రవికుమార్, రాంప్రసాద్ రెడ్డి, ఎమ్మెల్యేలు దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్, ఎంఎస్ రాజు తదితరులతో కలిసి ఆయన పరిశీలించారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల వాగ్దానాలన్నింటినీ నెరవేర్చిందని అన్నారు. సభకు రావాలని టీడీపీ కార్యకర్తలు గ్రామాల్లో ఇంటింటికీ తిరిగి పిలుస్తున్నారని, ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారని అన్నారు. సభను విజయవంతం చేయడానికి జనసేన, బీజేపీ, టీడీపీ కలసి పనిచేస్తున్నాయని అన్నారు. సూపర్ సిక్స్ హామీలతోపాటు జిల్లాకు లైఫ్‌లైన్‌గా నిలిచే హంద్రీనీవా ప్రాజక్టును 100 రోజుల్లో పూర్తిచేశామని అన్నారు. హంద్రీనీవా కాలవను విస్తరించి, రెట్టింపు నీటిని తీసుకురావడంతో జిల్లా రైతుల్లో ఆనందం వ్యక్తమవుతోందని అన్నారు. కడపలో జరిగిన మహానాడు సభ అద్భుతం అనుకుంటే.. అంతకు మించి కళకళలాడేలా ఏర్పాట్లు అనంతలో జరుగుతున్నాయని అన్నారు.

ఎమ్మెల్యే రాజు ఇంట నాయకుల సందడి



మంత్రులు, నాయకుల 'సక్సెస్' సన్నాహక మీట్




సభ ఏర్పాట్లపై మంత్రి, ఎమ్మెల్యేల సమాలోచన

అనంతపురం క్రైం, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు ఇంట సోమవారం టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా, ఇతర మంత్రులు సందడి చేశారు. సూపర్ సిక్స్-సూపర్ హిట్ సభ నేపథ్యంలో జిల్లాకు వచ్చిన పల్లా శ్రీనివాసరావు, మంత్రులు పయ్యావుల కేశవ్, నారాయణ, రాంప్రసాద్‌రెడ్డి, గొట్టిపాటి రవికుమార్, అనగాని సత్యప్రసాద్, సీఎం ప్రోగ్రామ్స్ కో-ఆర్డినేటర్ మంతెన సత్యనారాయణ రాజు, ఎమ్మెల్యేలు వెంకటరాజు, పులివర్తి నాని, పల్లె సింధూర, జయనాగేశ్వర్‌రెడ్డి, అమిలినేని సురేంద్రబాబు, దగ్గుపాటి వెంకటేశ్వప్రసాద్, పరిటాల సునీత, అశోక్‌రెడ్డి, ఆనంద బాబు, బండారుశ్రావణి, పత్తిపాటి పుల్లారావు, ఎమ్మెల్సీలు భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి, బీద రవిచంద్ర, ధర్మవరం ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్, కార్పొరేషన్ల చైర్మన్లు వీరాంజనేయులు, రవినాయుడు, సత్య ఆయన ఇంటికి వచ్చారు. ఇంటికి వచ్చిన అధ్యక్షుడు, అమాత్యులు, అతిథులకు ఎమ్మెల్యే ఎంఎస్ రాజు దంపతులు సాదరంగా స్వాగతం పలికారు. విందు తర్వాత సీఎం కార్యక్రమం విజయవంతంపై చర్చించారు.

రేపు ట్రాఫిక్ మళ్లింపు

సీఎం పర్యటన నేపథ్యంలో పోలీసుల ఆంక్షలు



పోలీసు శాఖ విడుదల చేసిన హైదరాబాద్ నుంచి బెంగళూరు రూట్ మ్యాప్

అనంతపురం క్రైం, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): నగరంలో సూపర్ సిక్స్-సూపర్‌హిట్ బహిరంగ సభ నేపథ్యంలో ట్రాఫిక్ మళ్లించినట్లు ఎస్పీ జగదీష్ సోమవారం ప్రకటనలో తెలిపారు. ఆంక్షలను వాహనదారులు తప్పనిసరిగా పాటించాలన్నారు. హైదరాబాద్ నుంచీ బెంగళూరు వైపు వెళ్లే వాహనదారులు అనంతపురం నగరం నుంచి కాకుండా వడియంపేట, బుక్కరాయసముద్రం, నాయనపల్లి క్రాస్, నార్పల క్రాస్, బత్తలపల్లి, ధర్మవరం, ఎన్ఎస్ గేట్ మీదుగా నేషనల్ హైవే 44 మార్గంలో వెళ్లాలన్నారు. కర్నూలు నుంచి తిరుపతి, చెన్నై వెళ్లే వాహనదారులు వడియంపేట, బుక్కరాయసముద్రం, నాయనపల్లి క్రాస్, బత్తలపల్లి, కదిరి, మదనపల్లె మార్గంలో వెళ్లాలని సూచించారు. బళ్లారి నుంచీ బెంగళూరు వెళ్లే వాహనదారులు చెళ్లికెర, తుంకూరు, నెలమంగళ, బెంగళూరు మార్గంలో ప్రయాణించాలని సూచించారు. బెంగళూరు నుంచీ హైదరాబాద్ వెళ్లే వాహనదారులు బత్తలపల్లి, నార్పల క్రాస్, నాయనపల్లి క్రాస్, బుక్కరాయసముద్రం, వడియంపేట, నేషనల్ హైవే 44 రహదారిలోకి చేరి ప్రయాణించాలన్నారు. తిరుపతి, చెన్నై నుంచి కర్నూలు వెళ్లాలనుకునే వాహనదారులు కదిరి, బత్తలపల్లి, నార్పల క్రాస్, నాయనపల్లి క్రాస్ మీదుగా బుక్కరాయసముద్రం వచ్చి వడయంపేట మీదుగా నేషనల్ హైవే 44 చేరుకుని కర్నూలు వెళ్లాలని సూచించారు. బెంగళూరు నుంచి బళ్లారి వెళ్లే వాహనాలు సైతం అనంతపురం రాకుండా నెలమంగళ, తుంకూరు, చెళ్లికెర మార్గంలో వెళ్లాలని ఎస్పీ సూచించారు.



పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇస్తున్న ఎస్పీ

సభకు ముమ్మర ఏర్పాట్లు: కలెక్టర్

అనంతపురం కలెక్టరేట్, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న సూపర్ సిక్స్-సూపర్ హిట్ సభ కోసం ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నట్లు కలెక్టర్ వినోద్‌కుమార్ తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటన నేపథ్యంలో సోమవారం నగరంలోని అనంతపురం-బెంగళూరు జాతీయ రహదారిలో టాటా మోటార్స్ ఎదురుగానున్న స్థలంలో ఏర్పాటు చేస్తున్న రెండు హెలీప్యాడ్లలో ఏర్పాట్లను కలెక్టర్, ఎస్పీ జగదీష్, జేసీ శివ నారాయణ శర్మ, సీఎం భద్రతాధికారులు పరిశీలించారు. అనంతరం శ్రీనగర్ కాలనీలోని జీఎంఆర్ గ్రౌండ్స్ వద్ద నిర్వహించే సూపర్ సిక్స్-సూపర్ హిట్ బహిరంగ సభ ఏర్పాట్లను ఎమ్మెల్సీ, సీఎం పర్యటన కోఆర్డినేటర్ మంతెన సత్యనారాయణ, కలెక్టర్, ఎస్పీ, జేసీ తదితరులు పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ... సభకు పటిష్ఠ ఏర్పాట్లు చేపట్టామన్నారు. అంబులెన్స్‌ల ఏర్పాటు, ఆస్పత్రికి వెళ్లే దారుల్లో ఇబ్బంది ఉండదన్నారు. మంగళవారం కాన్వాయ్ రిహార్సల్స్, ట్రయల్ ల్యాండింగ్ చేపడతామని కలెక్టర్ తెలిపారు.

అధికారులు ప్రణాళికతో వ్యవహరించాలి

ముఖ్యమంత్రి జిల్లా పర్యటన నేపథ్యంలో అధికారులంతా ప్రణాళికతో వ్యవహరించాలని కలెక్టర్ వినోద్‌కుమార్ సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో డీఆర్‌డీఏ, మెప్మా, డ్వామా అధికారులు, కమాండ్ కంట్రోల్ రూమ్ సిబ్బందితో కలెక్టర్ సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ... కమాండ్ కంట్రోల్ రూమ్ నుంచి మానిటర్ చేయాలన్నారు. సభలో పాల్గొనేందుకు వచ్చే ప్రజలు ఏం చేయాలి, ఏం చేయకూడదనేది అందరికీ తెలియజేయాలన్నారు. సమావేశంలో డీఆర్వో మలోల, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ తిప్పేనాయక్, డీఆర్‌డీఏ పీడీ శైలజ, డ్వామా పీడీ సలీంబాషా, మెప్మా పీడీ విశ్వజ్యోతి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్ కుమార్

ఏళ్ల ఎదురుచూపులు..!

(5వ పేజీ తరువాయి)

పడినప్పటికీ వాటికి విద్యుత్ కనెక్షన్లు లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. నూతన దరఖాస్తులకు సంబంధించి అధికారులు కనీసం అంచనాలు వేసేందుకు కూడా రాలేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. దీంతో రైతుల పాలిట ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు శాపంగా మారింది.

6 వేలకుపైగా దరఖాస్తులు

జిల్లావ్యాప్తంగా ట్రాన్స్‌ఫార్మర్ల కోసం 6 వేలకుపైగా దరఖాస్తులు వచ్చినట్లు ఆ శాఖ అధికారులు పేర్కొంటున్నారు. వీటిలో 3 వేలకుపైగా డీడీలు తీశారు. ట్రాన్స్‌ఫార్మర్లు అందక రైతులు ఆయా మండలాల్లోని విద్యుత్ అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. ఉన్నతాధికారులు స్పం దించి ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

అంచనాలు వేయడంలో లైన్‌మెన్ నిర్లక్ష్యం

పొలాల్లో ట్రాన్స్‌ఫార్మర్ల కోసం రైతులు దరఖాస్తు చేసుకుంటారు. వారికి అవసరమైన పరికరాల కోసం పొలాల వద్దకు లైన్‌మెన్ వెళ్లి అంచనాలు తయారు చేయాల్సి ఉంటుంది. లైన్‌మెన్‌ను రైతులు ఎన్నిసార్లు అడిగినా పట్టించుకోవడం లేదని బాధితులు ఆరోపిస్తున్నారు. అంచనాలు వేయాలని ఎంత వేడుకున్నా వారు కనికరించడం లేదని వాపోతున్నారు. కొంతమంది లైన్‌మెన్ ఆమ్యామ్యాలు ఇస్తేనే అంచనాలు వేస్తామని తెగేసి చెబుతున్నారని తెలుస్తోంది.



ధర్మవరం మండలం ఏలుకుంట్ల వద్ద విద్యుత్ సరఫరా లేక నీరు రాలేదని చూపుతున్న సాకే మల్లేష్

రెండేళ్లుగా ఎదురుచూస్తున్నా

నాకు ఐదెకరాల భూమి ఉంది. రెండేళ్లక్రితం బోరుబావి తవ్వించా. మొదట్లో పక్క రైతులతో కరెంట్ కనెక్షన్ తీసుకుని మామిడి పంట సాగుచేశా. వారు కనెక్షన్ తీసేయడంతో బోరులో నీరు ఉన్నా.. పంటలు సాగుచేసుకోలేకపోతున్నా. ప్రస్తుతం వర్షపు నీటితోనే మామిడి చెట్లను కాపాడుకుంటున్నా. ఎండాకాలంలో ట్యాంకుల ద్వారా తడులు ఇస్తున్నా. రెండేళ్లుగా నూతన ట్రాన్స్‌ఫార్మర్ కోసం దరఖాస్తు చేసుకుని ఎదురుచూస్తున్నా.

- సాకే మల్లేష్, ఏలుకుంట్ల గ్రామం, ధర్మవరం

రైతులందరికీ ట్రాన్స్‌ఫార్మర్లు మంజూరు చేస్తాం

దరఖాస్తు చేసుకున్న రైతులందరికీ ట్రాన్స్‌ఫార్మర్లు మంజూరు చేస్తాం. డీడీలు తీసిన ఆయా రైతుల పొలాల్లో ఏర్పాటు చేస్తాం. మిగతా రైతులకు మంజూరు కాగానే అందజేస్తాం. వీటిపై ఎవరూ ఆందోళన చెందవద్దు.

- సంపత్‌కుమార్, విద్యుత్ శాఖ ఎస్ఈ, శ్రీసత్యసాయి జిల్లా

అధికారుల బాగోతం బయటపెడతాం..

ట్రాన్స్‌ఫార్మర్ విద్యుత్ కనెక్షన్ కోసం విద్యుత్ శాఖలో కిందిస్థాయి నుంచి పైస్థాయి వరకు అందరికీ ముడుపులు ముట్టజెప్పామనీ, అయినా మంజూరు చేయట్లేదని యాడికికి చెందిన రైతులు ఆరోపిస్తున్నారు. వారి బాగోతం బయటపెడతామని హెచ్చరిస్తున్నారు. మండలంలో 200మంది రైతులకుపైగా ట్రాన్స్‌ఫార్మర్ల కోసం ఎదురుచూపులు చూస్తున్నారు. రైతుల జాబితాను ట్రాన్స్‌కో కార్యాలయంలో ఏర్పాటుచేశారు. జాబితాలో సీనియారిటీ పేరుతో రైతులను ట్రాన్స్‌కో కార్యాలయం చుట్టూ తిప్పుకుంటున్నారు. ఓపిక నశించిన రైతులు ట్రాన్స్‌కో అధికారులతో పలుమార్లు వాగ్వాదాలకు దిగారు కూడా. అయినా ట్రాన్స్‌కో అధికారులు స్పందించడం లేదు. ట్రాన్స్‌ఫార్మర్లు వస్తే.. మెటీరియల్ లేదనీ, మెటీరీయల్ వస్తే ట్రాన్స్‌ఫార్మర్లు లేవని సాకులు చెప్పి.. రైతుల ఆగ్రహానికి గురవుతున్నారు. సీనియారిటీ జాబితా ప్రకారం అయినా ట్రాన్స్‌ఫార్మర్లు మంజూరు చేస్తారా అంటే అదీ లేదు. పలుకుబడి, రాజకీయ నాయకుల అండదండలు, మామూళ్లు ఇచ్చుకునే రైతులకు మాత్రం నెలరోజుల వ్యవధిలోనే ట్రాన్స్‌ఫార్మర్లు మంజూరు చేస్తున్నారు. ఇవేవీ లేని సామాన్య రైతులు ట్రాన్స్‌ఫార్మర్ల కోసం ఏళ్ల తరబడి నిరీక్షించాల్సి వస్తోందని బాధితులు వాపోతున్నారు. అధికారులు అడిగినంత ముడుపులు ముట్టజెప్పినా ట్రాన్స్‌ఫార్మర్లు మంజూరు చేయడం లేదని పలువురు రైతులు ఆరోపిస్తున్నారు.



ఏడాదిన్నరగా ఎదురుచూపులే..

ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు కోసం డబ్బులు కట్టి ఏడాదిన్నర అవుతోంది. అప్పుడు ఇస్తాం.. ఇప్పుడు ఇస్తాం.. అంటూ కాలయాపన చేస్తున్నారు. ట్రాన్స్‌ఫార్మర్ ఇస్తే పంటలు సాగుచేస్తామని ఎదురు చూస్తున్నా. ఏడాదిన్నరగా ట్రాన్స్‌ఫార్మర్ ఇవ్వకపోవడంతో పొలాన్ని బీడుగా పెట్టుకోవాల్సి వచ్చింది. ట్రాన్స్‌కో అధికారులను ప్రశ్నిస్తే పొంతనలేని సమాధానాలు చెబుతున్నారు.

- భాస్కర్‌రెడ్డి, రైతు యాడికి

డబ్బులు కట్టి రెండేళ్లవుతోంది

ట్రాన్స్‌ఫార్మర్ కోసం డబ్బులు కట్టి రెండేళ్లవుతోంది. ఇంతవరకు మంజూరు చేయలేదు. ట్రాన్స్‌కో కార్యాలయం చుట్టూ తిరుగుతూనే ఉన్నా. అధికారులు పొంతనలేని సమాధానాలు చెబుతున్నారు. ట్రాన్స్‌ఫార్మర్ల మంజూరులో అధికారుల నిర్లక్ష్యంతో పొలాలను బీడుగా పెట్టుకోవాల్సి వస్తోంది. ట్రాన్స్‌ఫార్మర్ల మంజూరు కోసం అధికారులు తక్షణమే చర్యలు చేపట్టి రైతులను ఆదుకోవాలి.

- నారాయణరెడ్డి, రైతు, గుడిసెలు గ్రామం, యాడికి మండలం

బీసీల పట్ల జగన్ నిర్లక్ష్యం

(5వ పేజీ తరువాయి)

విధంగా స్మార్ట్ పేఫోన్‌లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 110గురుకులాల్లో 700స్మార్ట్ పేఫోన్‌లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు తల్లిదండ్రులకు స్మార్ట్ పే ఫోన్ ద్వారా ఫోన్ చేసి మాట్లాడారు.

ప్రజా ఆరోగ్యానికి పెద్దపీట

రాష్ట్ర వ్యాప్తంగా ప్రజా ఆరోగ్యానికి ఎన్డీఏ ప్రభుత్వం పెద్దపీట వేస్తున్నట్లు మంత్రి సవిత పేర్కొన్నారు. పెనుకొండ సమీపంలో అరకొరగా పనులు జరిగి, ఆగిపోయిన వైద్య కళాశాలను మంత్రి సోమవారం పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ జగన్, మాజీ మంత్రులు వైద్య కళాశాలలపై విష ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ఈనెల 10న సూపర్ సిక్స్- సూపర్‌హిట్ కార్యక్రమాన్ని అనంతపురంలో పెద్దఎత్తున చేపడుతుండటాన్ని జీర్ణించుకోలేని జగన్ అండ్‌కో తప్పుడు ప్రచారాలు చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో రూ.8,480కోట్లతో 17 మెడికల్ కళాశాలలు నిర్మిస్తామని 2020లో జగన్ డబ్బా కొట్టాడన్నారు. అయితే నాబార్డ్, కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన రూ.2125కోట్ల నిధులను ఐదు వైద్య కళాశాలలకు ఖర్చు చేశాడని ఆరోపించారు. ఇంకా రూ.674కోట్లు బకాయిలు పెట్టి, భవన నిర్మాణాలను అసంపూర్తిగా వదిలేశాడని విమర్శించారు. మిగిలిన కళాశాలల నిర్మాణానికి ఒక్క ఇటుక కూడా వేయలేదన్నారు. కూటమి ప్రభుత్వం పది మెడికల్ కళాశాలలను పీపీపీ మోడల్‌లో నిర్మించాలని నిర్ణయించిందని, దీనిపై జగన్ తప్పుడు ప్రచారం చేయడం దారుణమన్నారు. ఆయా కార్యక్రమాల్లో మార్క్‌ఫెడ్ చైర్మన్ బంగార్రాజు, యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ కేశవయ్య, మార్కెట్‌యార్డ్ చైర్మన్ రామకృష్ణప్ప, కన్వీనర్ శ్రీరాములు, ప్రసాద్, సింగిల్‌విండో అధ్యక్షుడు పోతిరెడ్డి, గుట్టూరు సూరీ, మాజీ జెడ్పీటీసీ నారాయణస్వామి, త్రివేంద్ర, ఎగువగడ్డ కృష్ణమూర్తి, షౌకత్, వాసుదేవరెడ్డి పాల్గొన్నారు.

బాబును చూసి బుద్ధి తెచ్చుకో: మంత్రి సవిత

రొద్దం, (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు నాయుడు రాష్ట్రాన్ని ఎలా అభివృద్ధి చేస్తున్నారో చూసి.. బుద్ధి తెచ్చుకోవాలని మాజీ సీఎం జగన్‌కు రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత జౌళిశాఖ మంత్రి సవిత విమర్శించారు. మండల కేంద్రంలో టీడీపీ కార్యాలయాన్ని మంత్రి సవిత, ప్రభుత్వ చీఫ్ విప్, వినుకొండ ఎమ్మెల్యే ఆంజనేయులు, పరిశీలకుడు నరసింహారావు సోమవారం ప్రారంభించారు. మంత్రి మాట్లాడుతూ.. వైసీపీ ప్రభుత్వం పది లక్షల కోట్ల అప్పులిచ్చినా.. చంద్రబాబు సూపర్ సిక్స్ హామీలను అమలు చేస్తున్నారన్నారు. ఈనెల 10న అనంతపురంలో నిర్వహించే సూపర్‌సిక్స్, సూపర్‌హిట్ కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రులు, ఎమ్మెల్యేలు పాల్గొంటారన్నారు. మండలం నుంచి పెద్దఎత్తున కార్యకర్తలు తరలిరావాలని సవిత కోరారు.

చీనీ టన్ను రూ.17వేలు

అనంతపురం రూరల్, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): నగరంలోని వ్యవసాయ మార్కెట్‌లో సోమవారం సీజనల్ చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.17వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి రాఘవేంద్రకుమార్ తెలిపారు. అలాగే కనిష్ఠంగా రూ.8వేలు, సరాసరి ధర రూ.12వేలు పలికాయన్నారు. మార్కెట్‌కు మొత్తంగా 432 టన్నుల చీనీకాయలు వచ్చినట్లు పేర్కొన్నారు.

క్రైం కార్నర్

అనుమానాస్పదంగా ఇంటర్ విద్యార్థి మృతి

- నంద్యాల జిల్లా డోన్ వసతి గృహంలో ఘటన
- విద్యార్థి యాడికి వాసి


శ్యాంసుందర్ (ఫైల్)

యాడికి, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన యాడికికి చెందిన ఇంటర్ విద్యార్థి శ్యాంసుందర్ (16) ప్రభుత్వ వసతి గృహంలో అనుమానాస్పదంగా మృతి చెందిన సంఘటన సోమవారం నంద్యాల జిల్లా డోన్‌లో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. యాడికిలోని చౌడేశ్వరికాలనీకి చెందిన రమేష్, సావిత్రి దంపతులు చేనేత వృత్తిద్వారా జీవనం గడుపుతున్నారు. వీరికి ఇద్దరు కుమారులు. పెద్దకుమారుడు శ్యాంసుందర్ నంద్యాల జిల్లా డోన్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ఎంపీసీ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. అక్కడే ప్రభుత్వ బాలుర వసతి గృహంలో ఉంటున్నాడు. సెలవులు అని ఇంటికి వచ్చిన శ్యాంసుందర్ ఇంటివద్ద మగ్గం పనులు చురుకుగా చేసేవాడు. ఆదివారం మధ్యాహ్నం డోన్‌కు వెళ్లాడు. రాత్రి 7గంటల సమయంలో కూడా తల్లిదండ్రులకు ఫోన్ చేసి మాట్లాడాడు. సోమవారం ఉదయం 6 గంటల సమయంలో శ్యాంసుందర్ ఉంటున్న హాస్టల్ నుంచి ఫోన్ వచ్చింది. శ్యాంసుందర్ హాస్టల్‌లోనే ఉరివేసుకున్నాడని సమాచారం ఇచ్చారు. దీంతో తల్లిదండ్రులు, బంధువులు హుటాహుటిన డోన్‌కు వెళ్లారు. ఉరివేసుకున్న శ్యాంసుందర్ మృతదేహాన్ని పరిశీలించి తమ కుమారుడి మృతిపై అనుమానాలు ఉన్నాయని తల్లిదండ్రులు తెలిపారు. వారి ఫిర్యాదు మేరకు డోన్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం శ్యాంసుందర్ మృతదేహాన్ని యాడికి తీసుకువచ్చి అంత్యక్రియలు నిర్వహించారు.


విద్యార్థి మృతదేహం వద్ద రోదిస్తున్న తల్లిదండ్రులు, బంధువులు

కృష్ణాపురంలో యువకుడు..


వేణు (ఫైల్)

గార్లదిన్నె, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కృష్ణాపురం గ్రామంలో వేణు (26) అనే యువకుడు అనుమానస్పదస్థితిలో మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు మేరకు.. కృష్ణాపురం గ్రామానికి చెందిన బోయ నాగరాజు కుమారుడు వేణుకు ఆరు సంవత్సరాలు క్రితం మర్తాడు గ్రామానికి చెందిన శ్రీరాములు కుమార్తె లక్ష్మీతో వివాహమైంది. వీరికి కుమార్తె, కుమారుడు సంతానం. వేణు, లక్ష్మీ తరుచు గొడవ పడుతుండేవారు. ఈ క్రమంలోనే మర్తాడులో కాపురం పెట్టారు. డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. పది రోజుల క్రితం దంపతులు గొడవ పడ్డారు. దీంతో వేణు కుమారుడిని తీసుకుని కృష్ణాపురం వెళ్లాడు. ఆదివారం సాయంత్రం లక్ష్మి కూడా కుటుంబ సభ్యులతో కలసి కృష్ణాపురం వెళ్లింది. అ సమయంలో వేణు గ్రామంలో లేకపోవడంతో లక్ష్మి కుమారుడిని తీసుకుని మర్తాడుకు వెళ్లింది. రాత్రి ఎంత సేపటికి ఇంటికి రాకపోవడంతో వేణుకు కుటుంబ సభ్యులు ఫోన్ చేశారు. తాను ఆలస్యంగా వస్తానని చెప్పాడు. తెల్లవారుజామున కుటుంబ సభ్యులు లేచి చూడగ వేణు ఇంటి ముందు వేసిన షెడ్డులో లుంగీతో ఉరివేసుకుని వేలాడుతున్నట్లు గుర్తించారు. చుట్టుపక్కల వారి సాయంతో వేణును కిందకు దింపగా అప్పటికే మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. తన కుమారుడి మృతిపై అనుమానం ఉందని మృతుడి తండ్రి నాగరాజు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ప్రాణం తీసిన ప్రశ్న

- తిండి గింజలు అమ్ముకుంటావా అని ప్రశ్నించిన భార్య
- గొడ్డలితో నరికి చంపిన భర్త


లక్ష్మీదేవి (ఫైల్)

చిలమత్తూరు, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): ఇంట్లో ఉన్న తిండి గింజలు అమ్ముకొని తాగేశావా అని ప్రశ్నించినందుకు ఓ వ్యక్తి తన భార్యను ఆదివారం రాత్రి గొడ్డలితో నరికి చంపాడు. మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో రాఘవేంద్ర, లక్ష్మీదేవి(30)లు నివాసమున్నారు. వీరికి శృతి అనే కుమార్తె ఉంది. రాఘవేంద్ర కొన్నేళ్లుగా జులాయిగా తిరుగుతూ మద్యానికి బానిసయ్యాడు. దీంతో భార్య భర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతుండేవి. భర్త జులాయిగా తిరుగుతుండటంతో లక్ష్మీదేవి కుటుంబ పోషణ కోసం కూలి పనులకు వెళ్లేది. ఈక్రమంలో ఆదివారం ఆమె పనికి వెళ్లిన తర్వాత ఇంట్లో నిల్వ ఉంచిన 50 కిలోల బియ్యాన్ని రాఘవేంద్ర ఎత్తుకెళ్లి అమ్మేశాడు. వచ్చిన డబ్బుతో మద్యం తాగి ఇంటికి వచ్చాడు. కూలి పని నుంచి వచ్చిన లక్ష్మీదేవి ఇంట్లో బియ్యం కనపడకపోవడంతో భర్తను నిలదీసింది. ఈ నేపథ్యంలో ఇద్దరి మధ్య గొడవ జరిగింది. తీవ్ర ఆగ్రహం చెందిన రాఘవేంద్ర రాత్రి 10 గంటల పైన నిద్రపోతున్న లక్ష్మీదేవిని గొడ్డలితో నరికాడు. ఆమె రక్తపు మడుగులో పడి ఉండటం చూసిన చుట్టుపక్కల వారు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని లక్ష్మీదేవిని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం బాగేపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన డాక్టర్లు ఆమె మృతిచెందినట్లు నిర్ధారించారు. మృతురాలి తల్లి గంగమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు రాఘవేంద్రను అదుపులోకి తీసుకుని, కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మునీర్ అహమ్మద్ తెలిపారు.

గుర్తు తెలియని వృద్ధుడి మృతి



గుంతకల్లుటౌన్, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): స్థానిక రైల్వేస్టేషన్‌లోని ప్లాట్ ఫాం-3లో (65) సంవత్సరాల గుర్తుతెలియని వృద్ధుడు మృతి చెందినట్లు జీఆర్పీ ఎస్ఐ మహేంద్ర సోమవారం తెలిపారు. వృద్ధుడు అనారోగ్యంతో మృతిచెంది ఉంటాడన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి ఆచూకీ తెలిస్తే 9866144616 నంబరులో సమాచారం ఇవ్వాలన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

తుది దశకు..!

- పూర్తి కావస్తున్న డీఎస్సీ ఎంపిక ప్రక్రియ
- డ్యూయెల్ పోస్టుల స్థానంలో మరొకరికి అవకాశం
- నేడో.. రేపో.. కాల్ లెటర్లు..


డీఎస్సీ అర్హత జాబితాను సరిచూస్తున్న ఐటీ విభాగ సిబ్బంది

అనంతపురం విద్య, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): డీఎస్సీ-2025 నియామకాల ప్రక్రియ చివరి దశకు చేరుకుంది. 15 రోజుల క్రితం మెరిట్ లిస్టు ఇచ్చారు. ఇప్పటి వరకు 807 టీచర్ పోస్టులకుగాను 773 మంది అభ్యర్థులకు కాల్‌లెటర్లు పంపారు. అర్హత కలిగిన ఏ ఒక్క అభ్యర్థీ నష్టపోకూడదని విద్యాశాఖ ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి పెట్టారు. బోగస్‌ల ఏరివేతకు పటిష్ట చర్యలు తీసుకున్నారు. కాల్‌లెటర్లు వచ్చిన డీఎస్సీ ఎంపిక అభ్యర్థుల ఒరిజినల్ సర్టిఫికెట్లను జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో కమిటీలు ఏర్పాటు చేయించి, పక్కాగా పరిశీలింపజేస్తున్నారు. అదే అభ్యర్థుల సర్టిఫికెట్లను నాలుగుసార్లు ప్రత్యేక కమిటీలతో పరిశీలన చేయించారు. ఒకటి నుంచి మూడో దఫా వరకు అక్కడక్కడా అభ్యర్థుల సర్టిఫికెట్లపై రిమార్కులు బయటపడుతూ వచ్చాయి. దీంతో సోమవారం నాలుగోసారి ఆ సర్టిఫికెట్లను ఇతర కమిటీలతో పరిశీలన చేయించారు. అందులో ఒక్క రిమార్క్ కూడా రాలేదని వెరిఫికేషన్ బృందాలతోపాటు విద్యాశాఖ అధికార వర్గాలు తెలిపాయి. దీంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

త్వరలో ఎంపిక జాబితా?

టీచర్ల నియామకాల పక్రియను రాష్ట్ర శాఖ చేపడుతోంది. మెరిట్ ఆధారంగా లిస్టు ప్రకటించి, ఆ తర్వాత సబ్జెక్టులతో సంబంధం లేకుండా అభ్యర్థులను అక్కడే ఎంపికచేసి, వారికి నేరుగా కాల్‌లెటర్లు పంపారు. ఆ కాల్ లెటర్లు వచ్చిన అభ్యర్థులకు మాత్రమే జిల్లాలో విద్యాశాఖ అధికారులు.. సర్టిఫికెట్ల పరిశీలన చేయించారు. ఆ సమయంలో కొందరు అభ్యర్థులు తమకు ఎక్కువ మార్కులు ఉన్నా.. కాల్‌లెటర్ రాలేదని ఆందోళన చెందుతూ కార్యాలయాలు, అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. కాల్‌లెటర్లు వచ్చిన అభ్యర్థులు ఏ సబ్జెక్టుకు ఎంపికయ్యారో కూడా ఎవరికీ తెలీకపోవడంతో ఇలాంటి ఆరోపణలు వచ్చాయి. ఇపుడు వాటికి చెక్ పెడుతున్నారు. ఎవరైనా అభ్యర్థి రెండు పోస్టులకు ఎంపికై ఉండుంటే ఆయనకు దరఖాస్తులో ఇచ్చిన ప్రాధాన్యత ఆధారంగా ఆ పోస్టుకు ఎంపిక చేసి, ఇతర పోస్టులకు ఆయా సబ్జెక్టులో అర్హత ఉన్నోళ్లకు అవకాశం కల్పించనున్నారు. ఈ డ్యూయెల్ పోస్టులకు ఇతర అభ్యర్థులను ఎంపికచేసి నేడో.. రేపో.. జిల్లాలకు జాబితా పంపనున్నారు. ఆ మేరకు అభ్యర్థులకు కాల్ లెటర్లు పంపనున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం డీఈఓలతో విద్యాశాఖ కమిషనర్ విజయరామరాజు రాజధానిలో సమావేశం నిర్వహించారు. పరిశీలనలో రిమార్కులు, రిజెక్టు అయిన వారి సమాచారం తెలుసుకున్నారట. దీనిపై క్లారిటీ రావడంతో ఇక కటాఫ్ ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేసి, జాబితా విడుదలకు మార్గం సుగమమైందని విద్యాశాఖ అధికారులు తెలిపారు.

సంక్షేమానికి కట్టుబడిన ప్రభుత్వం

- ఏపీ భవన, నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డు చైర్మన్ బాబ్జీ


మాట్లాడుతున్న వలవల మల్లికార్జునరావు

అనంతపురం టౌన్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో భవన, నిర్మాణ రంగ కార్మికుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఏపీ భవన, నిర్మాణ కార్మిక సంక్షేమబోర్డు చైర్మన్ వలవల మల్లికార్జునరావు(బాబ్జీ) పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని విజయనగర లా కాలేజి సెమినార్ హాల్‌లో సోమవారం ఉమ్మడి జిల్లా కార్మికశాఖ అధికారులతోపాటు భవన నిర్మాణ కార్మికులు, భవన నిర్మాణ కార్మిక సంఘాల నాయకులు, ట్రేడ్ యూనియన్లు, వివిధ స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులతో సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమీక్షకు వలవల ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమం, అభివృద్ధి కోసం సంక్షేమ బోర్డు అన్నిరకాల చర్యలు చేపడుతోందన్నారు. కార్యక్రమంలో కార్మికశాఖ ఉపకమిషనర్ లక్ష్మీ నరసయ్య, శ్రీ సత్యసాయి జిల్లా సహాయ కమిషనర్ శ్రీకాంత్ నాయక్, ధర్మవరం సహాయ కమిషనర్ సూర్యనారాయణ, అనంతపురం ఉపకమిషనర్ లావణ్య, కార్మికశాఖ అధికారులు, సిబ్బంది, భవన నిర్మాణ కార్మికులు, కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

రేపటి నుంచి క్రీడాపోటీలు

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు8(ఆంధ్రజ్యోతి): 2025-26 విద్యాసంవత్సరానికి సంబంధించి స్కూల్ గేమ్స్ సమాఖ్య ఉమ్మడి జిల్లాస్థాయి క్రీడాపోటీలు ఈనెల 10వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు సమాఖ్య జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు సోమవారం ప్రకటనలో తెలిపారు. అండర్-11, 14, 17, 19 బాలబాలికల విభాగాల్లో పోటీలు ఉంటాయన్నారు. అండర్-11కి సంబంధించి 2015 జనవరి 1వ తేదీ తరువాత జన్మించి ఉండి 3, 4, 5 తరగతుల విద్యార్థులు అర్హులన్నారు. అండర్-14కు 2025 జనవరి 1వ తేదీ తరువాత జన్మించిన 6వ తరగతి నుంచి ఇంటర్ వరకు చదువుతున్న వారు అర్హులన్నారు. అండర్-17కు 2009 జనవరి 1వతేదీ తరువాత జన్మించి, 6 నుంచి ఇంటర్ వరకు చదువుతున్న వారు అర్హులన్నారు. అండర్-17కు 2007 జనవరి 1వతేదీ తరువాత జన్మించి 6 నుంచి ఇంటర్ వరకు చదువుతున్న వారు అర్హులన్నారు.

రేపు క్యాంపస్ డ్రైవ్

అనంతపురం విద్య, సెప్టెంబరు8(ఆంధ్రజ్యోతి): ఇంటర్ విద్యార్థులకు ఉన్నత విద్యను అందించి, ఉద్యోగావకాశాలు కల్పించే దిశగా ఈనెల 10న స్థానిక పాలిటెక్నిక్ కళాశాలలో క్యాంపస్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు హెచ్‌సీఎల్ సంస్థ ప్రతినిధి నారాయణ సోమవారం ప్రకటనలో తెలిపారు. 2024-25లో కనీసం 75శాతం మార్కులతో ఇంటర్ ఉత్తీర్ణులైనవారు పాల్గొనవచ్చన్నారు. ఈ క్యాంపస్ డ్రైవ్ ద్వారా హెచ్‌సీఎల్ టెక్‌బీ, ఎర్లీ కెరీర్ ప్రోగ్రాం కింద ఐటీ పరిశ్రమలోకి వెళ్లే అవకాశం కల్పిస్తారన్నారు. శిక్షణ సమయంలో స్టైఫండ్ చెల్లిస్తారన్నారు. ఈ ప్రత్యేక డ్రైవ్ పాలిటెక్నిక్ కళాశాలలోని స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో ఉదయం 9.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు కొనసాగుతుందన్నారు.

గుత్తి కోట ట్రెక్కింగ్

గుత్తి, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): గుత్తి కోటపై అడ్వెంచర్ స్పోర్ట్స్ అకాడమీ టీం ఆధ్వర్యంలో సోమవారం ట్రెక్కింగ్ నిర్వహించారు. అడ్వెంచర్ టీంకు స్థానిక గుత్తికోట సంరక్షణ సమితి నాయకులు ఘనస్వాగతం పలికారు. గుత్తికోటలోని కట్టడాలను పరిశీలించి నివేదికను జిల్లా టూరిజం శాఖ, కేంద్ర పురావస్తు శాఖకు అందజేస్తామని టీం సభ్యులు ఈశ్వర్, మురళీకృష్ణ తెలిపారు. కార్యక్రమంలో విజయ్ భాస్కర్, నాగరాజు, సుధాకర్ నాయుడు, జిలాన్, నిజాం పాల్గొన్నారు.


గుత్తికోటను ఎక్కేందుకు వచ్చినవారితో సంరక్షణ సమితి ప్రతినిధులు

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

రాప్తాడు, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): మహిళలు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని జిల్లా సీనియర్ సివిల్ జడ్జి రాజశేఖర్ తెలిపారు. మహిళా శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో మిషన్ శక్తిలో భాగంగా రాప్తాడులోని అంగన్వాడీ కేంద్రంలో సోమవారం మహిళలతో సమావేశం నిర్వహించారు. గృహహింస, లైంగిక వేధింపులు, అత్యవసర పరిస్థితుల్లో మహిళలు, బాలికలకు అందించే సేవల గురించి వివరించారు. మహిళలు అత్యవసర పరిస్థితుల్లో చైల్డ్ హెల్ప్‌లైన్ 1098కు కాల్ చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా మిషన్ కో ఆర్డినేటర్ శ్రీదేవి, జిల్లా ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ కృష్ణమాచారి, అసిస్టెంట్ డిఫెన్స్ కౌన్సిల్ మహేష్, సూపర్‌వైజర్లు నాగరత్న, హేమలత తదితరులు పాల్గొన్నారు.

రైతు సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం

- సీపీఐ నాయకుల మండిపాటు
- కలెక్టరేట్, రెవెన్యూ కార్యాలయాల వద్ద ఆందోళన


ఆందోళన చేస్తున్న సీపీఐ, రైతుసంఘం నాయకులు

అనంతపురం విద్య, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): రైతుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలమైందంటూ సీపీఐ జిల్లాకార్యదర్శి పాళ్యం నారాయణస్వామి మండిపడ్డారు. రైతు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఏపీరైతు సంఘం ఆధ్వర్యంలో సీపీఐ నాయకులు సోమవారం రైతులతో కలిసి స్థానిక కలెక్టరేట్ వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా నారాయణస్వామి మాట్లాడుతూ.. ప్రస్తుతం రాష్ట్రంలో ఎక్కడా చూసినా యూరియా కోసం రైతులు బారులు తీరడం చూస్తుంటే ప్రభుత్వం రైతుల పట్ల ఎంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందో అర్థమవుతోందన్నారు. అధికారపార్టీ అండదండలతో యూరియాను ఏజెన్సీలు బ్లాక్‌మార్కెట్‌కు తరలించి సొమ్ము చేసుకున్నాయని, అందువల్లే రైతులకు యూరియా కష్టాలు ఏర్పడ్డాయని ఆరోపించారు. యూరియాను తరలించిన డిస్ట్రిబ్యూటర్లతోపాటు అందుకు సహకరించిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం గ్రీవెన్స్‌లో కలెక్టర్ వినోద్‌కుమార్‌ను కలిసి రైతులకు ఎరువులను సకాలంలో అందించేలా చూడాలని వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో నారాయణస్వామి, శ్రీరాములు, రమణయ్య, కృష్ణుడు, రామాంజనేయులు పాల్గొన్నారు.

పీఎఫ్ పట్ల అప్రమత్తంగా ఉండాలి

- ఉప లోకాయుక్త రజని


హెచ్చెల్సీ లోకలైజేషన్ డివిజన్ ఈఈ కార్యాలయం

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పీఎఫ్ విషయంలో ప్రభుత్వ ఉద్యోగులు అప్రమత్తంగా ఉండాలని ఉప లోకా యుక్త పి.రజని సోమవారం సూచించారు. గతంలో జలవనరుల శాఖ పరిధిలోని హెచ్చెల్సీ లోకలైజేషన్ డివిజన్‌లో రూ.27 లక్షలు పీఎఫ్ సొమ్ము స్వాహా కలకలం రేపిన విషయం తెలిసిందే. దీనిపై బాధితులు లోకాయుక్తకు ఫిర్యాదు చేశారు. కేసు వివరాలు ఇలా..

హెచ్చెల్సీ లోకలైజేషన్ డివిజన్‌లో 2021 మార్చి నెలలో ఉద్యోగ విరమణ పొందిన డీఈ రామసంజన్న జీపీఎఫ్ ఖాతా నుంచి రూ.17.14లక్షలను జూనియర్ అసిస్టెంట్ ప్రవేశ్‌కుమార్ నకిలీ ఐడీలను సృష్టించి, పెనుకొండలోని ఓ ప్రైవేటు ఏజెన్సీ ఖాతాలో జమ చేశాడు. ఈ మొత్తాన్ని కర్ణాటక రాష్ట్రం తుమకూరులోని ఓ బ్యాంకులో డ్రాచేశారు. ఇందులో రూ.15లక్షలు జూనియర్ అసిస్టెంట్ ప్రవేశ్‌కుమార్ తీసుకుని, మిగిలిన మొత్తాన్ని బినామీ ఖాతాదారుడికి అందజేశారు. రూ.15లక్షల్లో రూ.10లక్షలతో బంగారం కొనుగోలు చేసినట్లు సమాచారం.

- మరో కేసులో జేఈ జీపీఎఫ్ రూ.10లక్షలను, పుట్టపర్తి మండలం బ్రాహ్మణపల్లి బ్యాంకులోని బినామీ ఖాతాలో జమచేశారు. అక్కడ కూడా బినామీ చేత డ్రా చేయించి, స్వాహా చేశారు. వీటిపై అప్పట్లో హెచ్చెల్సీ ఎస్ఈగా ఉన్న రాజశేఖర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. విచారణ చేసిన పోలీసులు నిందితుడైన ప్రవేశ్‌కుమార్‌పై క్రిమినల్ కేసు నమోదు చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు లోకాయుక్త విచారణ చేసి బకాయిలపై 7.1శాతం వడ్డీని చెల్లించాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. అప్పట్లో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లుగా పనిచేసిన కె వెంకటరమణారెడ్డి, ఎ వెంకటసురేష్ బాబు, అప్పటి సూపరింటెండెంట్లు పీఎండీ ఉస్మాన్, కె సుబ్రహ్మణ్యంలతో పాటు జూనియర్ అసిస్టెంట్ ప్రవేశ్‌కుమార్‌లపై క్రిమినల్ కేసు నమోదు చేశారు. కేసు దర్యాప్తులో భాగంగా ప్రవేశ్‌కుమార్‌ను అరెస్ట్ చేసి కస్టడీకి తరలించారు. ఫిర్యాదుదారుల సమస్యను పరిష్కరించడం, బాధ్యులైన అధికారులపై క్రమశిక్షణా చర్యలు తీసుకోవడంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ జలవనరుల శాఖ, ఆర్థిక శాఖల ప్రధాన కార్యదర్శుల తక్షణ స్పందన పట్ల ఉపలోకాయుక్త రజని అభినందనలు తెలిపారు. నిర్లక్ష్యం, మోసం కారణంగా ఏ ఉద్యోగి కష్టపడి పొదుపు చేసిన సొమ్ము కోల్పోకుండా చర్యలు తీసుకోవాలని ఆమె సూచించారు.


క్రేన్ సాయంతో గేదెను బావి నుంచి బయటకు తీస్తున్న సిబ్బంది

హమ్మయ్యా..! బతికిపోయా..!!

మేత మేస్తూ ఓ పాడి గేదె ప్రమాదవశాత్తు బావిలో పడింది. అందులో నీళ్లు ఉండటంతో ప్రాణాపాయం తప్పింది. కానీ బయటకు వచ్చే మార్గం కాన రాక ఆ గేదె నీళ్లలోనే ఈదుకుంటూ ఉండిపోయింది. కాసేపటి తర్వాత రైతు గేదె కోసం వెతకగా బావిలో కనిపించింది. దీంతో ఆయన గ్రామస్థుల సాయంతో క్రేన్‌ను తెప్పించారు. దాని ద్వారా తాళ్లను కట్టి గేదెను ఒడ్డుకు చేర్చారు. గేదెను రూ.1.5 లక్షలకు కొనుగోలు చేసినట్లు రైతు కత్తే తిమ్మన్న తెలిపాడు. ఈ సంఘటన మండలంలోని కత్తే కొట్టాల గ్రామంలో సోమవారం జరిగింది.

\- ధర్మవరంరూరల్, ఆంధ్రజ్యోతి

షెడ్డుపైకి దూసుకెళ్లిన లారీ

- సెక్యూరిటీ గార్డు దుర్మరణం


మస్తాన్ (ఫైల్)

తాడిపత్రి, సెప్టెంబరు8(ఆంధ్రజ్యోతి): మండలంలోని బుగ్గ సమీపాన సోమవారం తెల్లవారుజామున లారీ అదుపుతప్పి రేకులషెడ్డుపైకి దూసుకెళ్లింది. అందులో నిద్రిస్తున్న సెక్యూరిటీ గార్డు మస్తాన్(50)పై వెళ్లడంతో అతడు దుర్మరణం చెందాడు. రూరల్ సీఐ శివగంగాధర్ రెడ్డి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. తాడిపత్రిలోని అంబేడ్కర్ నగర్‌కు చెందిన మస్తాన్ హైవే పనుల వద్దకు సెక్యూరిటీ గార్డుగా వెళ్తుండేవాడు. అందులో భాగంగా ఆదివారం రాత్రి బుగ్గ సమీపాన రోడ్డు పనులు చేపడుతున్న ప్రాంతంలో ఏర్పాటు చేసిన తాత్కాలిక షెడ్డులో నిద్రించాడు. తెల్లవారుజామున బనగానపల్లి వైపు నుంచి తాడిపత్రికి వస్తున్న లారీ అదుపుతప్పి షెడ్డుపై దూసుకెళ్లింది. అందులోని మస్తాన్‌పై లారీ వెళ్లడంతో అతడు అక్కడికక్కడే మరణించాడు. అతడికి భార్య సుశీల, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వివరించారు.

విద్యుదాఘాతంతో టీడీపీ కార్యకర్త మృతి


సురేష్ (ఫైల్)

కణేకల్లు, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని సీతారామనగర్ క్యాంపు వద్ద పొలంలో టీడీపీ కార్యకర్త సురేష్(24) సోమవారం విద్యుదాఘాతంతో మరణించాడు. బొమ్మనహాళ్ మండలం గోనేహాళ్ గ్రామానికి చెందిన సురేష్ టీడీపీలో చురుకైన కార్యకర్త. ఎలక్ట్రీషియన్ పనులు చేస్తుండేవాడు. సోమవారం సీతారామనగర్ క్యాంపు వద్ద సోమనాథ్ అనే రైతు పొలంలో విద్యుత్ మరమ్మత్తులు చేస్తుండగా.. ప్రమాదశాత్తు విద్యుత్ షాక్ కొట్టి మృతి చెందాడు. సురేష్‌కు ఆరునెలల క్రితం పవిత్రతో వివాహమైంది సురేష్ మృతి చెందడంతో ఇరు కుటుంబాల్లో తీవ్ర విషాదం నెలకొంది.

పాముకాటుతో బాలిక..

బ్రహ్మసముద్రం, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని బుడిమేపల్లికి చెందిన హేమశ్రీ (6) పాముకాటుతో చికిత్స పొందుతూ సోమవారం మరణించింది. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బుడిమేపల్లికి చెందిన హరిజన బడిగే మల్లికార్జున, మారెక్క దంపతుల కుమార్తె హేమశ్రీ. ఈనెల 5వ తేదీన బాలికను పాము కాటు వేసింది. హుటాహుటిన కళ్యాణదుర్గం ఆర్డీటీ వైద్యశాలకు తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం అనంతపురం ప్రభుత్వ వైద్యశాలకు తీసుకెళ్లారు. మూడురోజులుగా చికిత్స పొందుతూ బాలిక సోమవారం మరణించింది. దీంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. మల్లికార్జునకు ముగ్గురు సంతానం. వారిలో ఇద్దరు కుమార్తెలు, బాబు ఉన్నారు. హేమశ్రీ పెద్ద కుమార్తె.

యువతి అదృశ్యం

గార్లదిన్నె, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెనకచెర్ల గ్రామానికి చెందిన యువతి బోయ అశ్విని అదృశ్యమైంది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పెనకచెర్ల గ్రామానికి చెందిన బోయ నాగరత్నమ్మ కుమార్తె సరోజను కర్నూలు జిల్లా ఆలూరికి చెందిన వ్యక్తికి ఇచ్చి వివాహం చేశారు. సరోజ కుమార్తె అశ్విని చిన్నప్పట్నుంచి పెనకచెర్లలో అమ్మమ్మ నాగరత్న వద్దే ఉంటూ చదువుకుంటోంది. నెల రోజుల క్రితం అశ్వినికి అనంతపురానికి చెందిన ఓ యువకుడితో వివాహ నిశ్చితార్థం చేసుకున్నారు. ఈనెల 5న బ్యాంకులో పని ఉందని అమ్మమ్మకు చెప్పి.. అశ్విని గార్లదిన్నెకు వెళ్లింది. సాయంత్రమైనా ఇంటికి రాకపోవడంతో నాగరత్నమ్మ.. కుమార్తె సరోజకు ఫోన్ చేసి, విషయం చెప్పింది. తన వద్దకు రాలేదని కుమార్తె చెప్పడంతో అశ్విని కోసం బంధువులు, తెలిసిన వారి వద్ద వెతికారు. ఆచూకీ లభించకపోవడంతో సోమవారం గార్లదిన్నె పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆ మేరకు అశ్విని కోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

మహిళలకు బొట్టు పెట్టి ఆహ్వానం


బొట్టుపెట్టి సభకు ఆహ్వానిస్తున్న తెలుగు మహిళలు

చెన్నేకొత్తపల్లి, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): జిల్లాకేంద్రంలో ఈనెల 10న జరిగే సూపర్‌సిక్స్-సూపర్‌హిట్ సభకు తరలిరావాలని తెలుగుమహిళలు పిలుపు నిచ్చారు. ఈ క్రమంలో మండలంలోని న్యామద్దల గ్రామంలో సోమవారం ఇంటింటికీ వెళ్లి మహిళలకు బొట్టుపెట్టి ఆహ్వానించారు. కార్యక్రమంలో హిందూపురం పార్లమెంట్ తెలుగు మహిళా ప్రధానకార్యదర్శి రామసుబ్బమ్మ, విజయ, భాగ్యమ్మ, పలువురు హిళలు, నాయకులు పాల్గొన్నారు.

సభకు పాస్టర్లందరూ రావాలి


క్రిస్టియన్ సెల్ కార్యాలయంలో సమావేశమైన పాస్టర్లు

అనంతపురం టౌన్, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): జిల్లాకేంద్రంలో బుధవారం నిర్వహించనున్న సూపర్ సిక్స్ -సూపర్ హిట్ సభకు ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా ఉన్న పాస్టర్లందరూ తరలివచ్చి విజయవంతం చేయాలని టీడీపీ క్రిస్టియన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఈటె స్వామిదాస్ పిలుపునిచ్చారు. నగరంలోని క్రిస్టియన్ సెల్ జిల్లా కార్యాలయంలో సోమవారం ఆయన ఉమ్మడి జిల్లాలోని పాస్టర్లతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. కూటమి ప్రభుత్వం క్రైస్తవులను అన్ని విధాలా ఆదుకుందని తెలిపారు. అలాగే చర్చిల అభివృద్ధికి, బరియల్ గ్రౌండ్‌లకు నిధులు కేటాయించిందని చెప్పారు. సభకు క్రైస్తవులు పెద్దఎత్తున తరలివచ్చి ఈ ప్రభుత్వానికి కృతజ్ఞత చాటుకుందామని అన్నారు. పాస్టర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు అనిల్ మోజస్, పాస్టర్లు నాగరాజు, యేషయ, డేనియల్, ఆనంద్‌బాబు, భాగ్యమ్మ, క్రీస్తుదాసు తదితరులు పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ సభను సక్సెస్ చేద్దాం


మాట్లాడుతున్న పర్వతనేని శ్రీధర్‌బాబు

బుక్కరాయసముద్రం, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత తొలి సారిగా ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న సూపర్‌సిక్స్ - సూపర్ హిట్ సభను సక్సెస్ చేద్దామని టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి పర్వతనేని శ్రీధర్‌బాబు పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు. అనంతపురంలో జరిగే సూపర్ సిక్స్ సభకు జిల్లాలో ప్రజలు భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

సీఎం సభకు వేలాదిగా రండి


సమావేశంలో మాట్లాడుతున్న అర్బన్‌బ్యాంకు చైర్మన్ జేఎల్ మురళీధర్

అనంతపురం క్రైం/ క్లాక్‌టవర్, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): నగరంలో ఈనెల 10న జరిగే సూపర్‌సిక్స్-సూపర్‌హిట్ సభకు ప్రజలు వేలాదిగా తరలిరావాలని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, అర్బన్ బ్యాంకు చైర్మన్ జేఎల్ మురళీధర్ పిలుపునిచ్చారు. స్థానిక తన క్యాంపు కార్యాలయంలో సోమవారం ఆయన టీడీపీ నాయకులు, తెలుగు మహిళలతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఎన్నికల వేళ కూటమి నేతలు ఇచ్చిన హామీలు అమలు కావడంతో సూపర్ సిక్స్- సూపర్‌హిట్ బహిరంగసభకు అనంతపురం నగరం వేదికగా నిలిచిందన్నారు. కూటమి పార్టీల వేదికగా సాగే బహిరంగసభకు ప్రజలు వేలాది తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. నాయకులు ఐఎంఎం బాషా, జాకీర్, తలారి నాగేంద్ర, మధుసూదన్‌గౌడ్, బోయ గంగాద్రి, శేఖర్, సునీల్, సుంకర రమేష్, బండి వాణి, హేమంత్, అరుణ, ఉషారాణి, ప్రమీలమ్మ, సులోచనమ్మ, నూర్జహాన్, శకుంతల అర్బన్ బ్యాంకు డైరెక్టర్ అనిల్‌నాయుడు పాల్గొన్నారు.

అధికారుల సమక్షంలో అంత్యక్రియలు పూర్తి

చెన్నేకొత్తపల్లి, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): శ్మశానస్థల వివాదంతో నిలిచిపోయిన దళితుడి అంత్యక్రియలు అధికారుల హామీతో ఎట్టకేలకు పూర్తఅయ్యాయి. మండలంలోని బసంపల్లికి చెందిన నారాయణప్ప(85) అనారోగ్యంతో ఆదివారం మృతిచెందగా శ్మశానస్థల వివాదంతో అంత్యక్రియలు నిలిచిపోయిన విషయం తెలిసిందే. దీంతో సమస్య అధికారుల దృష్టికి వెళ్లింది. తహసీల్దార్ సురేశ్‌కుమార్, ఎస్ఐ సత్యనారాయణ గ్రామానికి చేరుకుని ఎస్సీలతో చర్చించినప్పటికీ సమస్య పరిష్కారం కాలేదు. దీంతో మృతుడి కుటుంబసభ్యులు, బంధువులు నిరసనకు దిగారు. చివరికి ధర్మవరం ఆర్డీఓ మహేశ్ ఆదివారం రాత్రి బసంపల్లికి చేరుకుని సమస్యపై ఎస్సీలతో చర్చించారు. గతంలో స్మశాన వాటిక కోసం కేటాయించిన స్థల వివాదం హైకోర్టులో ఉన్నందున అక్కడ అంత్యక్రియలు నిర్వహించడానికి సాధ్యపడదని తెలియజేశారు. అందుకు ప్రత్యామ్నాయంగా వేరొక స్థలంలో అంత్యక్రియలు నిర్వహించుకోవాలని సూచించారు. శ్మశాన స్థలసమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఇందుకు కుటుంబసభ్యులు, బంధువులు అంగీకరించారు. ధర్మవరం డీఎస్పీ హేమంత్‌కుమార్, రామగిరి సీఐ శ్రీదర్, తహసీల్దార్ సురేశ్‌కుమార్,సీఎస్‌డీటీ గురుప్రసాద్, ఎస్ఐసత్యనారాయణ సోమవారం గ్రామానికి వెళ్లి పరిస్థితిని పర్యవేక్షించారు. అనంతరం దగ్గరుండి అంత్యక్రియలను సైతం పూర్తి చేయించారు. తాత్కాలికంగా శ్మశాన స్థల వివాదం సద్దుమనిగినట్లైంది.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- డీసీ చైర్మన్ చంద్రశేఖర్ నాయుడు
- ఎంపీఆర్ నుంచి దక్షిణ కాలువకు సాగునీరు విడుదల


షట్టర్లకు పూజ చేస్తున్న చంద్రశేఖర్ నాయుడు, అధికారులు, నాయకులు

గార్లదిన్నె, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని డీసీ (డిస్ట్రిబూటరీ కెనాల్) చైర్మన్ చంద్రశేఖర్ నాయుడు పేర్కొన్నారు. మండలంలోని ఎంపీఆర్ డ్యామ్ నుంచి దక్షిణ కాలువకు సోమవారం ఆయన షట్టర్లకు పూజలు చేసి సాగునీటిని విడుదల చేశారు. అనంతరం మాట్లాడుతూ... 120 రోజుల పాటు దక్షిణ కాలువకు సాగునీరు విడుదల చేస్తామన్నారు. ఆయకట్టు రైతులు పంటల సాగుకు సిద్ధం కావాలని సూచించారు. దక్షిణ కాలువ కాలువ సమీపంలోని బోరుబావుల్లో సైతం భూగర్భజలాలు పెరుగుతాయని అన్నారు. ప్రస్తుతం 200 క్యూసెక్కులు నీరు విడుదల చేశామన్నారు. దశల వారీగా నీరు పెంచుతామన్నారు. ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ, ఏడీసీసీ బ్యాంకు చైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి సహకారంతో సాగునీరు విడుదల చేసినట్లు తెలిపారు. రాష్ట్రంలో రైతుల సంక్షేమం కోసం సీఎం అహర్నిశలు కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో నీటిపారుదల శాఖ ఎస్ఈ సుధాకర్, ఈఈ పార్థసారధి, జేఈ సురేంద్ర, డీసీ వైస్ చైర్మన్ చంద్రాయుడు, నాయకులు గేటుక్రిష్టారెడ్డి, పాండు, సుంకన్న, నరసింహా రెడ్డి, చితంబరప్ప, గుర్రం శీనా, డాబా వెంకటేష్, సురేష్ బాబు, కొడిదల రామకృష్ణ, కుళ్లాయప్ప పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ సభ ప్రతిష్ఠాత్మకం

- ప్రతిఒక్కరూ భాగస్వామ్యం కావాలి
- టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసులు పిలుపు


పల్లె నివాసంలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో పల్లా శ్రీనివాసులు

అనంతపురంరూరల్/ క్రైం, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): జిల్లాకేంద్రంలో ఈ నెల 10వ తేదీ బుధవారం జరిగే సూపర్‌సిక్స్-సూపర్‌హిట్ మహాసభ ఎంతో ప్రతిష్ఠాత్మమైందని, ఇందులో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసులు పిలుపునిచ్చారు. రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత జిల్లా కేంద్రంలోని తన క్యాంపు కార్యాలయంలో సోమవారం అనంతపురం రూరల్ మండలం నాయకులతో సమావేశం నిర్వహించారు. ఇందులో రాష్ట్ర అధ్యక్షుడు పాల్గొని మాట్లాడారు. సభకు జనం ఎక్కువగా వచ్చేలా చూడాలని పార్టీ శ్రేణులకు సూచించారు. దీనిని ప్రతి నాయకుడు, కార్యకర్త బాధ్యతగా తీసుకోవాలన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబుతోపాటు 164మంది ఎమ్మెల్యేలు, మంత్రులు సభలో పాల్గొంటారన్నారు. కాబట్టి ఇది మనకు ఎంతో ప్రతిష్ఠాత్మకమన్నారు. ఎమ్మెల్యే పరిటాల సునీత మాట్లాడుతూ.. రూరల్ మండలం నుంచి 20వేల మందికి తగ్గకుండా జనం వచ్చేలా చూడాలని నాయకులకు సూచించారు. సమావేశంలో నియోజకవర్గ పరిశీలకులు ఏలూరు సాంబశివరావు, మన్నే సుబ్బారెడ్డి, ఆదోని కృష్ణమ్మ, పరిటాల శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ మంత్రి పల్లె నివాసంలో..

అదేవిధంగా ఆలమూరురోడ్డులో గల మాజీ మంత్రి పల్లె రఘునాథ రెడ్డి నివాసంలో సూపర్ సిక్స్-సూపర్ హిట్ సభ పై టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసులు, ఎమ్మెల్యేలు బండారు శ్రావణి, జయనాగేశ్వర్ రెడ్డి, పల్లె సింధూరరెడ్డి, ఎమ్మెల్సీలు బీద రవిచంద్ర, రాంభూపాల్‌రెడ్డి, మాజీ మంత్రి అమరనాథ్‌రెడ్డి, సీఎం ప్రోగ్రాం కో ఆర్డినేటర్ వెంకటేష్, ఏడీసీసీబీ చైర్మన్ ముంటిమడగు కేశవరెడ్డి, మాజీ ఎంపీపీ శ్రీరామ్‌రెడ్డి తదితరులతో చర్చించారు. కార్యక్రమంలో బాలాజీ విద్యాసంస్థల చైర్మన్ పల్లె కిశోర్‌రెడ్డి, పుట్టపర్తి నియోజకవర్గ కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సభను విజయవంతం చేద్దాం

- ఎమ్మెల్యేలు పరిటాల సునీత, సాంబశివరావు పిలుపు


రామగిరిలో మాట్లాడుతున్న పరిటాల సునీత

చెన్నేకొత్తపల్లి/రామగిరి/కనగానపల్లి, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): జిల్లాకేంద్రంలో బుధవారం జరిగే సూపర్‌సిక్స్-సూపర్‌హిట్ సభను అందరం కలిసికట్టుగా విజయవంతం చేద్దామని రాప్తాడు, పరచూరు ఎమ్మెల్యేలు పరిటాలసునీత, సాంబశివరావు పిలుపునిచ్చారు. చెన్నేకొత్తపల్లి, రామగిరి, కనగానపల్లి మండలకేంద్రాల్లో సోమవారం వారు టీడీపీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ కార్యాలయాల్లో వెలుగు, ఉపాధి, డ్వాక్రాసంఘాల లీడర్లతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మా ట్లాడుతూ.. అనంతపురం నగరంలో 10న నిర్వహిస్తున్న సూపర్‌సిక్స్-సూపర్ హిట్ సభ విజయవంతానికి ప్రతి ఒక్కరు సమిష్టిగా కృషిచేయాలన్నారు. కూటమిప్రభుత్వం అమలు చే స్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి విషయంలో దుష్ప్రచారం చేస్తున్న వైసీపీ నాయకులకు సూపర్‌సిక్స్-సూపర్‌హిట్ సభ ద్వారా సమాధానం చెబుదామని అన్నారు. రాప్తాడు నియోజకవర్గం నుంచి 50వేల మందికి పైగా జనం వ స్తారన్న అంచనా ఉందన్నారు. అనంతరం ఆయా మండలాల్లో జనసమీకరణ, వాహన, భోజన సౌకర్యాలపై చర్చించారు. సమావేశా ల్లో ఏపీసీడ్స్ కార్పొరేషన్ చైర్మన్ మన్నె సుబ్బారెడ్డి, ఆదోని కృష్ణమ్మ, డీసీఎంఎస్, మార్కెట్‌యార్డ్ చైర్మన్లు నెట్టెం వెంకటేశ్, సుధాకర్‌చౌదరి, టీడీపీ సీనియర్ నాయకుడు ఎల్ నారాయణచౌదరి, రామ్మూర్తి, రంగయ్య, మండలాల కన్వీనర్‌లు ముత్యాల్‌రెడ్డి, సుధాకర్, యాతం పోతలయ్య, దండుఓబులేశు, అధికారులు పాల్గొన్నారు.

యూటీఎఫ్ రణభేరి ప్రచారయాత్ర పోస్టర్ల విడుదల


పోస్టర్లను విడుదల చేస్తున్న మాజీ ఎమ్మెల్సీ గేయానంద్, యూటీఎఫ్ నాయకులు

అనంతపురం విద్య, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): ఉద్యోగ, ఉపాధ్యాయుల డిమాండ్లు తీర్చాలని, విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని యూటీఎఫ్ చేపడుతున్న రణభేరి ప్రచారయాత్రను విజయవంతచేయాలని మాజీ ఎమ్మెల్సీ గేయానంద్ పిలుపునిచ్చారు. ఇందుకు సంబంధించిన పోస్టర్లను నగరంలోని తన నివాసం వద్ద సోమవారం ఆయన ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ ఈరణభేరి యాత్ర గుంతకల్లులో మొదలై ఉరవకొండ, రాయదుర్గం, కళ్యాణదుర్గం మీదుగా అనంతపురం చేరుకుంటుందన్నారు. కూటమి అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయినా ఇచ్చిన హామీలను నెరవేర్చకపోవడంతో ఉద్యోగ ఉపాధ్యాయులు తీవ్ర ఆవేదన చెందుతున్నారన్నారు. ఇలాంటి సమయంలో ఉద్యోగ ఉపాధ్యాయవర్గాలు ఐక్యతతో ముందుకుసాగుతూ పోరాటాలు చేసి తమ హక్కులను కాపాడుకోవాలని సూచించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు జిలాన్, లింగమయ్య, చంద్రమోహన్, శివానంద, కోటేశ్వరప్ప, చంద్రశేఖరరెడ్డి, ఓబులపతి, నారాయణ, రమేష్, వెంకటనాయుడు, నాగరాజు, సీపీఎం నేత హనుమంతరాయుడు తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌కు చేరిన పాదయాత్ర

అనంతపురం వైద్యం, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్‌ఏను రెన్యువల్ చేయాలని కోరుతూ ఉద్యమ నాయకుడు సాకేగోవిందు గుత్తి మండలం ఊబిచెర్ల గ్రామంలో గత శుక్రవారం మొదలుపెట్టిన పాదయాత్రతో సోమవారం కలెక్టరేట్‌కు చేరుకుంది ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిబంధనల పేరుతో కేంద్ర ప్రభుత్వం ఎఫ్‌సీఆర్‌ఏను రద్దుచేసి ఆర్డీటీ సేవలను కనుమరుగు చేసేందుకు యత్నిస్తోందని మండిపడ్డారు. ఎఫ్‌సీఆర్‌ఏను వెంటనే రెన్యువల్ చేసి ఆర్డీటీసేవల్ని కొనసాగించాలన్నారు. లేకపోతే వివిధరూపాల్లో పోరాటాలు సాగిస్తామని హెచ్చరించారు. నాయకులు రామాంజినేయులు, చంద్రయ్య, పుల్లన్న, నాగేంద్ర, కదిరప్ప, ఉసేనప్ప, ముత్యాలమ్మ, శాంతమ్మ, వెంకటరావమ్మ, మునలయ్య తదితరులు పాల్గొన్నారు.

శరన్నవరాత్రి ఉత్సవాలను జయప్రదం చేయండి


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఈఓ తదితరులు

అనంతపురం టౌన్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలో మొదటిరోడ్డులో గల కాశీవిశ్వేశ్వర కోదండ రామాలయంలో ఈనెల 22 నుంచి అక్టోబరు 2వ తేదీ వరకు నిర్వహించనున్న దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలను జయప్రదం చేయాలని ఆలయ ఈఓ నాగేంద్రుడు పిలుపునిచ్చారు. ఆలయ ఆవరణలో సోమవారం సాయంత్రం ఉత్సవాల కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ఉత్సవాల్లో భాగంగా అమ్మవారిని రోజుకొక అలంకారంలో పూజించడంతోపాటు వాహన సేవలు నిర్వహిస్తామన్నారు. భక్తులు విరివిగా పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఆలయ భక్తమండలి సభ్యులు నరేంద్ర చౌదరి, ఎర్రిస్వామి, ప్రధానార్చకుడు నరసింహశాస్త్రి, కిషోర్, పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి గొట్టిపాటిని కలిసిన విద్యుత్ ఉద్యోగులు

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): సూపర్ సిక్స్ సభ నిమిత్తం జిల్లా కేంద్రానికి వచ్చిన రాష్ట్ర విద్యుత్తు శాఖా మంత్రి గొట్టిపాటి రవికుమార్‌ను ఆలిండియా ఎస్సీ ఎస్టీ గెజిటెడ్ అధికారుల సంక్షేమసంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి రవిశంకర్ , విద్యుత్ విద్యోగులు సోమవారం మద్యాదపూర్వకంగా కలిశారు. రవిశంకర్ మాట్లాడుతూ.. గత వైసీపీ ప్రభుత్వంలో 2022వేతన సవరణకు సంబంధించి వార్షిక ఇంక్రిమెంట్లు ఆగిపోయాయని, కూటమి ప్రభుత్వం వచ్చాక విద్యుత్తు ఉద్యోగులకు తాత్కాలిక ఆర్థిక ప్రయోజనం కల్పించిందని, ఇది శుభపరిణామమని అన్నారు. విద్యుత్తు శాఖలో ఎన్నో ఏళ్లగా పెండింగ్‌లో ఉన్న ఇంజనీర్లు, కార్మికుల నియామకాలు చేపట్టాలని కోరారు. దీనికి మంత్రి సానుకూలంగా స్పందించారు.

పీజీఆర్‌ఎస్‌లో 401 వినతులు

అనంతపురం కలెక్టరేట్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)ను నిర్వహించారు. ఇందులో డీఆర్‌ఓ మలోల పాటు జెడ్పీ సీఈఓ శివశంకర్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు ఆనంద్, తిప్పేనాయక్, వ్యవసాయ శాఖ జేడీ ఉమామహేశ్వరమ్మ పాల్గొని వినతిప్రతాలు స్వీకరించారు. జిల్లాలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు పలు సమస్యల పరిష్కారం కోరుతూ మొత్తం 401 వినతులు అందజేశారు. డీఆర్‌ఓ మాట్లాడుతూ...సమస్యలను వేగవంతంగా పరిష్కరించాలని అన్ని శాఖల అధికారులను ఆదేశించారు. భూ సమస్యలు పరిష్కరించాలని, రేషన్‌కార్డులు, ఇంటి పట్టాలు, పింఛన్లు మంజూరు చేయాలని అధికమంది వినతులు ఇచ్చారు.

ఉద్యోగి మృతికి నివాళి

అనంతపురంరూరల్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న కుమార్ రెండు రోజుల కిందట అనారోగ్యంతో మృతి చెందారు. ఇందుకుగాను వర్సిటీ అధికారులు, ఉద్యోగులు వర్సిటీలోని పూలే భవనంలో సోమవారం సంతాప సభ నిర్వహించారు. వైస్‌చాన్సలర్ అనిత, రిజిస్ట్రార్ రమేష్‌బాబు, రెక్టార్ వెంకటనాయుడు తదితరులు కుమార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఆంజనేయులు, ఇతర కళాశాలల ప్రిన్సిపాళ్లు, ఉద్యోగులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

సభపై అధికారుల సమావేశం

నార్పల, సెప్టెంబర ు8(ఆంధ్రజ్యోతి): జిల్లాకేంద్రంలో బుధవారం జరిగే ముఖ్యమంత్రి చంద్రబాబు సభపై సోమవారం మండలకేంద్రంలో తహసీల్దార్ అరుణకుమారి, ఎంపీడీఓ మమతా దేవి వివిధ శాఖల అధికారులతో పాటు ఎన్‌ఆర్‌జీఎస్ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సభకు బస్సుల రూట్లు, స్టాఫ్ అటాచ్‌మెంట్, పబ్లిక్ మొబలైజేషన్ తదితర విషయాల గురించి చర్చించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీఓ, ఏపీఎం, ఏపీఓ, ఏఓ తదితరులు పాల్గొన్నారు.

రాప్తాడు: స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ విజయలక్ష్మి వెలుగు, ఉపాధి హామీ సిబ్బందితో సమావేశం నిర్వహించి మాట్లాడారు. మండలంలోని ప్రతి గ్రామం నుంచి డ్వాక్రా మహిళలు, ప్రజలు, ఉపాధి కూలీలు సీఎం సభకు తరలి వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. సభ కు వచ్చిన ప్రజల్ని తిరిగి సురక్షితంగా ఇంటి కి చేర్చాలన్నారు. టీడీపీ మండల ఇన్‌చార్జి ధర్మవరపు మురళి, కన్వీనర్ కొండప్ప, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, సర్పంచ్‌లు తిరుపాలు, శీనయ్య, సాకే జయరాముడు, వెంకట్రాముడు, కిష్టా, ఏపీఎం సునిత, ఏపిఓ సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

చెన్నేకొత్తపల్లి,సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం సమీపంలోని జాతీయ రహదారిపై సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలయ్యాయి. కేరళరాష్ట్రానికి చెందిన ఏడుగురు యువకులు మినీబస్సులో హైదరాబాద్ నుంచి కేరళకు వెళ్తున్నారు. చెన్నేకొత్తపల్లి వద్దకు రాగానే కియ కంపెనీకి చెందిన బస్సును వెనుక నుంచి ఢీకొన్నారు. దీంతో వారిలో అర్జున్, అగి, రాహుల్ తీవ్రంగా గాయపడ్డారు. వీరిని సీకేపల్లి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారిస్తున్నారు.

'చరిత్రలో నిలిచేలా సభ సక్సెస్ కావాలి'


మాట్లాడుతున్న ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్

అనంతపురం క్రైం, సెప్టెంబరు8(ఆంధ్రజ్యోతి): నగరంలో బుధవారం జరిగే సూపర్‌సిక్స్-సూపర్‌హిట్ సభ అనంతపురం జిల్లా చరిత్రలో నిలిచిపోయేలా సక్సెస్ చేయాల్సిన బాధ్యత మన అందరిపై ఉందని స్థానిక ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్‌తో పాటు ఇతర ఎమ్మెల్యేలు, టీడీపీ పరిశీలకులు పిలుపునిచ్చారు. అర్బన్ కార్యాలయంలో సోమవారం దగ్గుపాటి ప్రసాద్‌తో పాటు చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తినాని, గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తముల అశోక్‌రెడ్డి, కర్నూలు అర్బన్ అథారిటీ చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు, అప్కాబ్ చైర్మన్ గండి వీరాంజనేయులు, టీడీపీ అర్బన్ పరిశీలకులు లక్ష్మీనారాయణ కలిసి టీడీపీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అర్బన్‌లోని 50 డివిజన్లు, 4 పంచాయతీల నుంచి జన సమీకరణపై పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. సీఎం చంద్రబాబుతో పాటు 164 మంది ఎమ్మెల్యేలు, ఇతర పార్టీల ముఖ్యనేతలు వస్తున్నారని, ఈ క్రమంలో అర్బన్ నుంచి లక్షల మంది ప్రజలు తరలి వచ్చేలా ప్రణాళికతో ముందుకెళ్లాలని తెలిపారు. చరిత్రలో నిలిచేలా సభను సక్సెస్ చేయాలని, ఇందుకు ప్రతి క్లస్టర్, యూనిట్, బూత్ ఇన్‌చార్జులు సభకు ప్రజలు భారీగా తరలివచ్చేలా బాధ్యత తీసుకుని పనిచేయాలని సూచించారు.

ఎవరి భూమినీ.. ఆక్రమించలేదు

- గ్రీవెన్స్‌లో ముకుందాపురం రైతు

గార్లదిన్నె, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): తాను ఎవరి భూమిని ఆక్రమించలేదని, ఎస్సీల భూమిని ఆక్రమించానని తనపై కొంతమంది అనవసరంగా బురద జల్లుతున్నారని మండలంలోని ముకుందాపురం గ్రామానికి చెందిన రైతు సూర్య చంద్రారెడ్డి తహసీల్దార్ బండారు ఈరమ్మకు ఫిర్యాదు చేశాడు. మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌లో ఆయన తహసీల్దార్‌తో మాట్లాడారు. పెనకచెర్ల పొలం సర్వే నెంబరు 580-4లో 5.40 ఎకరాల భూమిని సుమారు 20 ఏళ్ల నుంచి సాగు చేసుకుంటున్నామని, ప్రభుత్వం కూడా పట్టా ఇచ్చిందని తెలిపారు. గత ఏడాది క్రితం నుంచి తమ గ్రామానికి చెందిన కొందరు ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన వారు ఆ పొలం తమదేనంటూ ఇబ్బందులు పెడుతున్నారని వాపోయాడు. ఆ విషయంపై ఇదివరకే రెవెన్యూ అధికారులు, పోలీసుల దృష్టికి కూడా తీసుకెళ్లామన్నారు. అయినప్పటికీ సంఘాల పేరుతో కొందరు తనను బ్లాక్ మెయిల్ చేయడం ఆపలేదని వాపోయాడు. తనకు న్యాయం చేయాలని తహసీల్దార్‌ను కోరాడు. లేని పక్షంలో తహసీల్దార్ కార్యాలయం ముందే నిరాహార దీక్ష చేస్తామని తెలిపాడు. స్పందించిన తహసీల్దార్ విచారణ చేస్తామని తెలిపారు. రైతుకు సీపీఐ, రైతు సంఘం నాయకులు మద్దతునిచ్చారు.

ఏపీటీఎఫ్ మండల కార్యవర్గం ఎన్నిక

రామగిరి, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): ఏపీటీఎఫ్ మండల నూతన కార్యవర్గాన్ని సోమవారం కుంటిమద్ది ఉన్నతపాఠశాలలో ఏకగ్రీవంగా ఎంపికచేశారు. ఎన్నికల అధికారిగా సానే రవీంద్రారెడ్డి వ్యవహరించారు. ముఖ్యఅతిథులుగా వచ్చిన రాష్ట్ర ఉపాధ్యక్షుడు అశోక్‌కుమార్, రాష్ట్ర కౌన్సిలర్ టీకే ముత్యాలప్ప, జిల్లా ఉపాధ్యక్షుడు బలరాముడు, రాష్ట్ర కౌన్సిలర్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో కార్యవర్గాన్ని ఎంపిక చేశారు. గౌరవాధ్యక్షుడిగా ఆదిశేషు, అధ్యక్షుడిగా కే.రామాంజనేయులు, ప్రధానకార్యదర్శిగా .హరిప్రసాద్, ఉపాధ్యక్షులుగా కొండప్ప, రామచంద్ర, ఎర్రిస్వామి, నాగరత్నమ్మ, కార్యదర్శులుగా శేషు, వేణుగోపాల్, నిర్మల, సూర్యప్రకాశ్, నారాయణస్వామి, జిల్లా కౌన్సిలర్లుగా బాబయ్య, రవికుమార్, రామాంజినేయులు, లక్ష్మీనారాయణ,మనోహర్, సునీతతోపాటు పలువురిని సభ్యులుగా ఎంపికచేశారు.

నేడు మేయర్ల సదస్సుకు వసీం

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు8(ఆంధ్రజ్యోతి): పట్టణ జీవన ప్రమాణాలను మెరుగుపరచడంతో సాంకేతికత పాత్ర అనే అంశంపై మంగళవారం ముంబైలో జరిగే జాతీయ మేయర్ల సదస్సుకు అనంత నగర మేయర్ మహ్మద్ వసీం సలీం హాజరుకానున్నారు. జాతీయ సదస్సుకు హాజరై నగరంలో చేపడుతున్న అభివృద్ధి పనులపై చర్చిస్తానని సోమవారం ఆయన పేర్కొన్నారు. స్మార్ట్‌సిటీ జాబితాలో అనంత నగరాన్ని చేర్చడానికి కృషి చేస్తానని తెలిపారు.

'ఏమి సాధించారని ఈ సూపర్ హిట్ సభ'

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఏమి సాధించిందని ఈ సూపర్‌హిట్ సభ పెడుతోందని సీఐటీయూ నాయకులు ప్రశ్నించారు. ఎన్నికల సందర్భంగా కూటమి ఇచ్చిన హామీల మెనిఫెస్టోను స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం వారు విడుదల చేశారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రకుమార్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ముఖ్యంగా మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో విఫలమైన కూటమి ప్రభుత్వం అంగన్‌వాడీలతో వెట్టిచాకిరీ చేయించుకుంటున్నారని ఆరోపించారు. ఏమి ఘనకార్యం చేశారని సూపర్‌హిట్ సభలు పెట్టుకుంటున్నారో చెప్పాలని ప్రశ్నించారు. ఉద్యోగ, కార్మికులకు న్యాయం చేసిన తరువాతే సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాన్‌లు జిల్లాలోకి అడుగుపెట్టాలని అన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్‌వీ నాయుడు, నగర అధ్యక్ష, కార్యదర్శులు వెంకటనారాయణ, ముత్తుజా, మున్సిపల్ నాయకులు నాగభూషణం, నాగరాజు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గ్రహణదోష నివారణ పూజలు


అనంతేశ్వరస్వామికి అభిషేకం చేస్తున్న భక్తులు

అనంతపురం టౌన్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి) : సంపూర్ణ చంద్రగ్రహణం ముగింపును పురస్కరించుకుని సోమవారం నగరంలోని పలు ఆలయాల్లో గ్రహణదోష నివారణ పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ నేపథ్యంలో శారదానగర్‌లోని శివబాలయోగి ఆశ్రమంలో అనంతేశ్వరస్వామికి అర్చకులు నిర్మల్య విసర్జన చేశారు. అనంతరం భక్తుల చేతుల మీదుగా ఫలపంచామృతాభిషేకాలు నిర్వహించారు. తర్వాత ప్రత్యేక అలంకరణలు చేయడంతోపాటు వేద మంత్రోచ్చారణల నడుమ చంద్ర గ్రహణ దోష నివారణ పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కార్యవర్గ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

యూరియాను రైతులకు అందుబాటులో ఉంచాలి: సీపీఐ


ఆర్డీఓ కార్యాలయ అధికారికి వినతి పత్రం ఇస్తున్న సీపీఐ నాయకులు

అనంతపురం రూరల్, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): రైతు సేవా కేంద్రాల్లో యురియాతో పాటు ఎరువులు, ప్రత్యామ్నాయ విత్తనాలను రైతులకు అందుబాటులో ఉంచాలని సీపీఐ జిల్లా సహాయకార్యదర్శి మల్లికార్జున డిమాండ్ చేశారు. ఈ మేరకు నగరంలోని ఆర్డీఓ కార్యాలయం ఎదుట సోమవారం ఆయన పార్టీ శ్రేణులతో కలిసి ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లాలో 26,839మెట్రిక్ టన్నుల యూరియా అవసరం ఉందన్నారు. ఇంతవరకు 15,241 మెట్రిక్ టన్నులు మాత్రమే పంపిణీ జరిగిందన్నారు. అయితే ఈ క్రాప్ ఆధారంగా ఎరువులు పంపిణీ చేస్తామని వ్యవసాయ అధికారులు చెబుతున్నారన్నారు. ఈక్రాప్‌తో సంబంధం లేకుండా యూరియా పంపిణీ చేయాలన్నారు. అదేవిధంగా ప్రత్యామ్నాయ విత్తనాలు రైతులకు అందుబాటులో ఉంచి అందించాలని కోరారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఆర్డీఓ కార్యాలయ అధికారికి అందజేశారు. సీపీఐ నియోజవకర్గ నాయకుడు శ్రీకాంత్, మండల సహాయ కార్యదర్శి దుర్గాప్రసాద్, రైతు సంఘం నాయకులు వన్నారెడ్డి, మన్నీల శాఖ కార్యదర్శి వెంకటరాముడు, నాయకులు గోవిందు, రాజు, అక్కులన్న, రెడ్డప్ప, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

- గార్లదిన్నె: స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీపీఐ, రైతు సంఘాల నాయకులు ధర్నా చేపట్టారు. ప్రత్యామ్నాయ పంటల సాగుకు జిల్లాలోని రైతులకు నాణ్యమైన విత్తనాలు, సరిపడా యూరియాను అందించాలని కోరుతూ తహసీల్దార్ బండారు ఈరమ్మకు వినతిపత్రం అందజేశారు. సీపీఐ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు చెన్నప్ప యాదవ్ , ఏఐవైఎఫ్ జిల్లా నాయకుడు శ్రీనాథ్ చౌదరి, రైతుకూలీ సంఘం జిల్లా నాయకుడు కిష్ట, సీపీఐ మండల కార్యదర్శి రాముడు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.
- నార్పల: స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద సీపీఐ నాయకులు ఆందోళన చేపట్టారు. అనంతరం రైతుల సమస్యలను పరిష్కరించాలని ఏఓ చిన్న వీరాంజనేయులకు వినతి పత్రం అందజేశారు. మండల కార్యదర్శి సాకే గంగాధర్, సహాయ కార్యదర్శి సాకే సుధాకర్, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి పెద్దపెద్దయ్య, రైతు సంఘం మండల కార్యదర్శి లలితమ్మ, నాయకులు నాగరాజు, నారాయణప్ప, పెద్దక్క పాల్గొన్నారు.
- శింగనమల: రైతు సేవా కేంద్రాల్లో యూరియా, ఎరువులు ప్రత్యామ్యాయ విత్తనాలు అందుబాటులో ఉంచాలని కోరుతూ సీపీఐ జిల్లా కార్యవర్గసభ్యుడు చిన్నప్పయాదవ్ స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో అధికారులకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు మధుయాదవ్, నేసేమధు చికెన్‌భాషా, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.
- రాప్తాడు: స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద సీపీఐ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. పలువురు మాట్లాడుతూ రైతులకు ఎరువుల సమస్య పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ విజయకుమారికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి రవీంద్ర, నాయకులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

రెగ్యులర్ తహసీల్దార్‌ను నియమించాలి


రాస్తారోకో చేస్తున్న సీపీఐ నాయకులు

కూడేరు, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): మండలానికి రెగ్యులర్ తహసీల్దార్‌ను నియమించాలని సీపీఐ నాయకులు, కార్యకర్తలు, స్థానికులు సోమవారం ఆందోళన చేపట్టారు. స్థానిక తహసీల్దారు కార్యాలయం ఎదుట అనంతపురం-బళ్లారి ప్రధాన రహదారిపై రాస్తారోకో చేపట్టారు. గంటపాటు రాస్తారోకో జరగడంతో ట్రాఫిక్ స్తంభించింది. ఏఎస్ఐ రామానాయుడు ఆందోళనకారులతో చర్చించారు. డిప్యూటి తహసీల్దారు ఉదయ్‌భాస్కర్ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో ఆందోళన విరమించారు. ఆందోళనలో సీపీఐ నాయకులు మల్లికార్జున, పెరుగుసంగప్ప, పార్వతీప్రసాద్, నాగేంద్ర, రమణ, శ్రీరాములు, నారాయణమ్మ, రమణప్ప, ప్రసాద్, మలరాయుడు పాల్గొన్నారు.

నెట్టికంటి సన్నిధిలో ఎమ్మెల్సీ ఆలపాటి


ఎమ్మెల్సీకి తీర్థప్రసాదాలను అందజేస్తున్న అధికారులు

గుంతకల్లుటౌన్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కసాపురం శ్రీ నెట్టికంటి ఆంజనేయస్వామి దేవాలయంలో టీడీపీ ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ బుచ్చి రాంప్రసాద్ స్వామి వారిని సోమవారం దర్శించుకున్నారు. ఆలయ అధికారులు వారికి స్వాగతం పలికారు. అర్చనలు చేసి ప్రత్యేకపూజలు నిర్వహించారు. అనంతరం వారికి స్వామి చిత్రపటం, తీర్థప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ యువ నాయకలు ఆర్ అనిల్ గౌడ్, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యం

ఉరవకొండ, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇంద్రావతి సమీపంలో హంద్రీనీవా కాలువలో గుంటూరు జిల్లా మాచర్లకు చెందిన నాగిరెడ్డి (28) ఆదివారం గల్లంతు కాగా.. అతని మృతదేహం సోమవారం లభ్యమైంది. వజ్రకరూరు మండలంలోని వీసీ ప్యాపిలి సమీపంలోని హంద్రీనీవా కాలువ వద్దకు వెళ్లిగా.. ప్రమాదవశాత్తు జారి పడి గల్లంతైన విషయం తెల్సిందే. ఇంద్రావతి సమీపంలోని కాలువలో అతని మృతదేహం తేలుతుండగా.. స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని పోలీసులు ఉరవకొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉన్నట్లు వజ్రకరూరు ఎస్ఐ నాగస్వామి తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

రాయదుర్గం రూరల్, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): స్థానిక శాంతినగర్ వద్ద ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో కర్ణాటక వాసి శివశంకర్ (39) గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మరణించాడు. ద్రావ జగెరెకు చెందిన శివశంకర్ రాయదుర్గంలో స్నేహితులను కలిసేందుకు వచ్చాడు. ఆదివారం రాత్రి శాంతినగర్‌లో నడుచుకొని వెళుతుండగా.. బైక్ ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. శివశంకర్‌ను స్థానికులు ఆసుపత్రికి తరలించారు. రాయదుర్గం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మరణించినట్లు పోలీసులు తెలిపారు.

రేషన్ బియ్యం, జొన్నలు స్వాధీనం

తాడిపత్రి, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని గన్నెవారిపల్లికాలనీలో నాగార్జున ఇంటివద్ద నుంచి అక్రమంగా నిల్వ ఉంచిన 46 క్వింటాళ్ల రేషన్ బియ్యం, 18.5 క్వింటాళ్ల జొన్నలను అధికారులు సోమవారం సీజ్‌చేశారు. ఈ దాడుల్లో విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి ప్రసాద్, సివిల్‌సప్లై అధికారి మల్లేష్, విజిలెన్స్ ఎస్ఐ మహేంద్రభూపతి, సిబ్బంది వెంకటస్వామి పాల్గొన్నారు.

మహిళ అదృశ్యం


యాడికి, సెప్టెంబరు8(ఆంధ్రజ్యోతి): మండలంలోని తూట్రాళ్లపల్లి గ్రామానికి చెందిన జయమ్మ గత నెల 28 నుంచి అదృశ్యమైనట్లు ఆమె కుమారుడు సాయికృష్ణ సోమవారం స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తులో ఉంది.

నిండిన ముద్దలాపురం చెరువు


మరువ పారుతున్న చెరువు

కూడేరు, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కృష్ణా జలల రాకతో ముద్దలాపురం చెరువు సోమ వారం నిండింది. 15 రోజులుగా హంద్రీనీవా ప్రధాన కాలువ నుంచి ముద్దలాపురం, ఇప్పేరు చెరువులకు నీరు చేరు తోంది. దీంతో సోమవారం ముద్దలాపురం చెరువు మరువ పారి ఇప్పేరు చెరువు వైపు నీరు వెళ్తోంది. చెరువు నిండేలా చర్యలు తీసుకున్న పయ్యావుల సోదరులకు రైతులు కృతజ్ఞతలు తెలిపారు.

ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ముళ్లకంపల తొలగింపు



బొమ్మనహాళ్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఉంతకల్లులో ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ముళ్లకంపలు, పిచ్చిమొక్కలు భారీగా పెరిగాయి. దీనికి ఆంధ్రజ్యోతి సోమవారం ఓ కథనాన్ని ప్రచురించింది. స్పందించిన విద్యుత్ ఏఈఈ లక్ష్మిరెడ్డి ఆ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఉన్న ముళ్లకంపలు, పిచ్చి మొక్కలు, స్తంభానికి అట్టుకున్న పిచ్చి తీగలను తొలగించేలా చర్యలు తీసుకున్నారు.

మే ఐ హెల్ప్ యూ ఆధ్వర్యంలో అంత్యక్రియలు

యాడికి, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): స్థానిక కొండకింద వీధిలో నివసిస్తున్న నీరుపొల్ల బొజ్జన్న అనారోగ్యంతో సోమవారం మరణించారు. మృతునికి భార్య తప్ప సంతానం లేకపోవడంతో అంత్యక్రియలకు ఇబ్బందులు పడుతుండగా మే ఐ హెల్ప్‌యు ఫౌండేషన్ సభ్యులు ముందుకువచ్చారు. సంప్రదాయబద్ధంగా బొజ్జన్న అంత్యక్రియలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు బండారు బాలకృష్ణ, ధ్రువనారాయణ, శంకరప్ప, లక్ష్మికాంతమ్మ, అశోక్‌కుమార్, హరీష్ పాల్గొన్నారు.

కార్పొరేట్ సెలూన్‌లను తొలగించాలి

గుంతకల్లుటౌన్, సెప్టెంబరు8(ఆంధ్రజ్యోతి): పట్టణంలో కార్పొరేట్ సెలూన్ షాపులను తొలగించి... సాంప్రదాయ కులవృత్తి దారులను ఆదుకోవాలని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాంకు క్షవర వృత్తిదారుల సంఘం నాయకులు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయీబ్రాహ్మణ సేవా సంఘం పట్టణ అధ్యక్షుడు జీ లక్ష్మీనారాయణ, క్షవర వృత్తిదారుల సంఘం జిల్లా కన్వీనర్ బీ శ్రీనివాసులు, పట్టణ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, వివిధ కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శి బదిలీ

రాయదుర్గం రూరల్, సెపెంబరు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామదట్ల సచివాలయం పంచాయతీ కార్యదర్శి ఎల్లక్క శెట్టురుకు బదిలీ అయినట్లు ఎంపీడీఓ కొండన్న సోమవారం తెలిపారు. ఇటీవల ప్రభుత్వం పంచాయతీ కార్యదర్శులను గ్రేడ్ 3 గా ఉద్యోగోన్నతి కల్పించడంతో ఎల్లక్క బదిలీ శెట్టురుకు వెళుతున్నట్లు తెలిపారు.

భోజనం.. అధ్వానం..!

● కళాశాలలో ఏజెన్సీ నిర్వాహకుల నిర్లక్ష్యం
● ఇళ్ల నుంచే భోజనం తెచ్చుకుంటున్న విద్యార్థులు


ఇంటి నుంచి తెచ్చుకున్న భోజనాన్ని తింటున్న విద్యార్థులు

బొమ్మనహాళ్, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ జూనియర్ కళాశాల్లోని గ్రామీణ విద్యార్థులు ఆకలితో ఇబ్బందులు పడకూడదని .. మధ్యాహ్న భోజనాన్ని వారికి కూడా అందించేలా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంది. అయితే ఏజన్సీల నిర్లక్ష్యం వల్ల చాలా మంది విద్యార్థులు కళాశాలలో భోజనం తినడం లేదు. ఇంటి నుంచే బాక్సులు తెచ్చుకుంటున్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజనాన్ని ఆంధ్రజ్యోతి సోమవారం విజిట్ చేసింది. చాలా మంది విద్యార్థులు ఇంటి నుంచి బాక్సులు తెచ్చుకొని తింటున్నారు. మరి కొందరు భోజనం తినకుండా పస్తులు ఉంటున్నారు. సోమవారం మెనూ ప్రకారం తెల్ల అన్నం, వెజిటబుల్ కర్రీ, గుడ్డు, చిక్కీ వడ్డించాల్సి ఉంది. అయితే విద్యార్థులకు తెల్ల అన్నం, ఆలుగడ్డ, వంకాయతో చేసిన కర్రీ, గుడ్డు, చిక్కీ ఇచ్చారు. 464 మంది విద్యార్థులకు గాను కేవలం 270 మంది మాత్రమే హాజరయ్యారు. ఇందులోనూ కొందరు ఇంటి నుంచే బాక్సులు తెచ్చుకోగా.. మరి కొందరు భోజనానికి ఇంటికి వెళ్తున్నారు. వారిని ఆంధ్రజ్యోతి పలకరించగా.. 'మధ్యాహ్న భోజనం కాలేజ్‌లో పెడితే మొదట చాలా సంతోషపడ్డాం. కొత్తలో బాగా ఉండేది. రానురాను అధ్వానంగా మారింది. కూర, పప్పు చాలా కారంగా చేస్తున్నారు. నీళ్లగా చేస్తున్నారు. కూరగాయలు వాడటం లేదు. అన్నం సరిగా ఉడికించడం లేదు. కిచిడి, పులిహోర కూడా అంతే. ఈ భోజనం బాగలేదని కళాశాల ప్రిన్సిపాల్‌కు ఫిర్యాదు చేశాము. అయినా మార్పు లేదని వాపోయారు.' అని వాపోయారు.

నాణ్యత ఉండాలని సూచించాం

మధ్యాహ్న భోజనం నాణ్యత ఉండేలా చేయాలని ఏజన్సీలకు సూచించాం. కొందరు విద్యార్థులు ఇంటి నుంచి బాక్సులు తెచ్చుకోవడం నిజమే. భోజనం నాణ్యతగా ఉండేలా చర్యలు తీసుకుంటాం

-హనుమంతనాయక్,
ఇన్‌చార్జి ప్రిన్సిపాల్, బొమ్మనహాళ్


యల్లనూరు సహకార సొసైటీ వద్ద వేచివున్న రైతులు


కణేకల్లులో యూరియా కోసం వచ్చిన రైతులు

యూరియా కోసం పడిగాపులు

యల్లనూరు, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): మండలంలో యూరియా కోసం రైతులు సోమవారం తెల్లవారుజాము నుంచి గోడౌన్ వద్ద పడిగాపులు కాశారు. మూడు రోజుల క్రితం మండలంలోని నిట్టూరు, యల్లనూరు సహకార సొసైటీ గోడౌన్‌లకు యూరియా వచ్చింది. అయితే అధికారులు పంపిణీకి కాలయాపన చేయడంతో రైతుల్లో యూరియా అందుతుందో లేదో అనే అనుమానం మొదలైంది. సోమవారం పంపిణీ చేస్తారని తెలియడంతో తెల్లవారుజామున 4గంటల నుంచి సహకార సొసైటీ, రైతు సేవా కేంద్రం వద్ద రైతులు ఎదురుచూశారు. సొసైటీ వద్ద రైతుల రద్దీ అధికంగా ఉండడంతో సొసైటీ సీఈఓ వీరనారప్ప యల్లనూరు రైతులకు రైతుసేవా కేంద్రంలో అందిస్తారని మిగిలిన గ్రామాల ప్రజలకు మాత్రమే ఇక్కడ ఇస్తారని తెలపడంతో రైతులు ఆందోళన చేశారు. అయితే పోలీసులు రంగప్రవేశం చేసి రైతులకు పంపిణీ చేయాలని ఆదేశించడంతో పంపిణీ ప్రారంభించారు.

● కణేకల్లు : స్థానిక రైతు సేవా కేంద్రానికి యూరియా కోసం వందలాది మంది రైతులు సోమవారం తరలివచ్చారు. పలువురు రైతులు క్యూలైన్‌లలో టవాళ్లను, చెప్పులను ఉంచగా.. ఓ రైతు ఏకంగా దగ్గరలో పడి ఉన్న మద్యం ఖాళీ బాక్స్‌ను ఉంచాడు. వందలాది మంది రైతులకు క్యూలైన్ ప్రకారం టోకన్లు అందించి యూరియా అందజేశారు.

యూరియా కొరతపై సీపీఐ ఆందోళన


బొమ్మనహాళ్‌లో తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఆంధ్రజ్యోతి, న్యూస్‌నెట్‌వర్క్: రైతులకు యూరియా కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని సీపీఐ నాయకులు, రైతు సంఘం నాయకులు పలు ప్రాంతాల్లో సోమవారం ఆందోళన చేపట్టారు. బొమ్మనహాళ్‌లో తహసీల్దార్ మునివేలు వినతి పత్రం అందించారు. అలాగే గుంతకల్లులో తహసీల్దార్ రమాదేవికి, గుత్తిలో తహసీల్దార్ పుణ్యవతికి, కుందుర్పిలో తహసీల్దార్ ఓబులేష్‌కు, విడపనకల్లులో తహసీల్దారు రమాదేవికి, యాడికిలో డిప్యూటి తహసీల్దార్ శ్రీనివాసులుకు, పెద్దవడుగూరులో తహసీల్దార్ ఉషారాణికి, కళ్యాణదుర్గంలో తహసీల్దార్ భాస్కర్‌కు వినతి పత్రాలను అందజేశారు. తాడిపత్రిలో అగ్రికల్చర్ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు.

పాత తహసీల్దార్ కార్యాలయం ఆక్రమణ


పాత తహసీల్దార్ కార్యాలయ గోడను కూల్చిన దృశ్యం

కుందుర్పి, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): స్థానిక పాత తహసీల్దార్ కార్యాలయం ఆక్రమణకు గురైంది. 15 సంవత్సరాల క్రితం నూతన తహసీల్దార్ కార్యాలయాన్ని నిర్మించారు. అయితే పాత తహసీల్దార్ కార్యాలయాన్ని రెవెన్యూ అధికారులు సీజ్ చేసి వదిలేశారు. అందులో కొన్ని గదులను స్థానిక వైసీపీ నాయకులు ఆక్రమించారు. మరో రెండు గదులను ఆక్రమించేందుకు గోడను కూల్చారు. ఈ విషయాన్ని స్థానికులు గమనించి తహసీల్దార్ ఓబులేష్‌కు సమాచారాన్ని అందించారు. ఆ భవనాన్ని ఖాళీ చేయాలని వైసీపీ నాయకులకు సోమవారం సూచించారు.

ఉత్సాహంగా క్రీడాపోటీలు


మొదటి స్థానం సాధించిన నెరమెట్ల పాఠశాల విద్యార్థినులు

ఉరవకొండ, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని నింబగల్లు జిల్లా పరిషత్ ఉన్న పాఠశాలలో సెపక్‌తక్రా సబ్ జూనియర్ బాలురు, బాలికలకు సోమవారం క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను ఎంఈఓ ఈశ్వరయ్య ప్రారంభించారు. జిల్లా నుంచి 12 జట్లు ఇందులో పాల్గొన్నాయి. బాలుర విభాగంలో ఉరవకొండ జిల్లా పరిషత్ సెంట్రల్ ఉన్నత పాఠశాల, బ్రహ్మసముద్రం జడ్పీహెచ్ఎస్ రెండో స్థానం, ఉరవకొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాల మూడో స్థానం దక్కించుకున్నాయి. బాలికల విభాగంలో జడ్పీహెచ్ఎస్ నెరమెట్ల మొదటిస్థానం, ఉరవకొండ జిల్లా పరిషత్ సెంట్రల్ ఉన్నత పాఠశాల రెండో స్థానం, మూడో స్థానంలో వజ్రకరూరు కేజీబీవీ పాఠశాల నిలిచాయి. కార్యక్రమంలో హెచ్ఎం విజయలక్ష్మి, సెపక్‌తక్రా జిల్లా కార్యదర్శి షాహిన్, పీఈటీలు పాల్గొన్నారు.

గోకులం షెడ్ల బిల్లుల కోసం ఆందోళన


ఏపీఓతో లబ్ధిదారుల వాగ్వాదం

యాడికి, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): గోకులం షెడ్ల నిర్మాణాలు పూర్తయి తొమ్మిది నెలలుపైగా అవుతున్నా తమకు బిల్లులు ఎందుకు చెల్లించడం లేదని పలువురు గోకులం లబ్ధిదారులు సోమవారం ఏపీఓ మద్దిలేటితో వాగ్వాదానికి దిగారు. తాము అప్పులుచేసి షెడ్లను నిర్మించామని వాపోయారు. దీనిపై ఏపీఓ మద్దిలేటి మాట్లాడుతూ.. మండలంలో పదిమంది లబ్ధిదారుల బిల్లులు రిజెక్ట్ అయ్యాయని, త్వరలోనే బిల్లులు చెల్లించేలా చర్యలు చేపడతామని తెలిపారు.

విద్యార్థులకు బహుమతుల అందజేత


విద్యార్థినికి బహుమతి అందిస్తున్న ఎస్‌బీఐ సిబ్బంది

డీ.హీరేహాళ్, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవం పురస్కరించుకొని నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విజేత విద్యార్థులకు సోమవారం బహుమతులు అందజేశారు. ప్రతిభచూపిన 24 మంది విద్యార్థులకు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తరపున ఎస్‌బీఐ బ్రాంచ్ మేనేజర్ రాజేష్ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం మునఫ్, సిబ్బంది పాల్గొన్నారు.

అల్లు కుటుంబానికి పరామర్శ



తాడిపత్రి, సెప్టెంబరు8(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో సినీ నిర్మాత అల్లుఅరవింద్ తల్లి కనకరత్నమ్మ అనారోగ్యంతో మరణించిన విషయం తెలుసుకున్న జేసీ పవన్ అక్కడకు వెళ్లి ఆ కుటుంబ సభ్యులను పరామర్శించారు. అల్లు అరవింద్, అల్లు అర్జున్‌ను పరామర్శించారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

గుంతకల్లు, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని 19, 20 విడతల కింద 33 మందికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ.15,61,886 మంజూరైంది. అందుకు సంబంధించిన చెక్కులను ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం స్థానిక గుంతకల్లుప్ప స్వామి కల్యాణ మండపంలో సోమవారం బాధితులకు అందజేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచీ ఇప్పటిదాకా నియోజకవర్గంలోని 278 మందికి రూ. 2.17 కోట్లు సీఎంఆర్ఎఫ్ మంజూరైనట్లు ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గుమ్మనూరు నారాయణ స్వామి, కేసీ హరి, బండారు ఆనంద్, బీఎస్ కృష్ణారెడ్డి, ఆమ్లెట్ మస్తాన్ యాదవ్, తలారి మస్తానప్ప, రామన్న చౌదరి, హనుమంతు పాల్గొన్నారు.

విద్యార్థినికి ఆర్థిక సాయం

శెట్టూరు, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): మండలం ఐదుకల్లు పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్న శ్రీప్రియ బ్రెయిన్ స్ట్రోక్‌కు గురికావడంతో.. బెంగళూరు సెయింట్ జాన్ ఆస్పత్రిలో 15 రోజుల క్రితం ఆపరేషన్ చేయించారు. ఇప్పటికే బాధితురాలి తండ్రి బోయ సతీష్ రూ. తొమ్మిది లక్షలు అప్పులు చేశాడు. విషయం తెలుసుకున్న ఇన్ఫినిటీ చారిటబుల్ ట్రస్టు ఛైర్మన్ బద్దేనాయక్ వెంటనే రూ.20 వేలు ఫోన్‌పో ద్వారా ఆర్థిక సాయం అందించారు. అలాగే మండల విద్యాధికారి శ్రీధర్ విషయాన్ని మండలంలోని పలువురు ఉపాధ్యాయుల దృష్టికి తీసుకెళ్లడంతో ఆర్థిక సాయం అందించడానికి వారు ముందుకు వచ్చారు.

బాధితుడికి పరామర్శ

విడపనకల్లు, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): స్థానిక యువకులు వారం క్రితం దాడి చేయడంతో స్థానికుడు, ఎస్సీ వర్గానికి చెందిన ఉలిగన్న అనంతపురం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెల్సిందే. ప్రాణాపాయ స్థితిలో ఉన్న అతన్ని గుంతకల్లు డివిజన్ ఎస్సీ, ఎస్టీ, విజిలెన్స్ మానిటరింగ్ కమిటి సభ్యుడు హరిప్రసాద్ యాదవ్ సోమవారం పరామర్శించారు. దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని, నగరాల్లోని కార్పొరేట్ ఆసుపత్రుల్లో ఉలిగన్నకు వైద్యం అందించాలని, ప్రభుత్వమే వైద్య ఖర్చులను భరించాలని కోరారు.

వయోజనులకు అక్షరజ్ఞానం అవసరం: విప్

రాయదుర్గం, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): వయోజనులకు అక్షరజ్ఞానం చాలా అవసరమని ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు సూచించారు. అంతర్జాతీయ అక్షరాస్యత వారోత్సవాల్లో భాగంగా పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం నిర్వహించిన వయోజన విద్య కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. చదువుకుంటున్న పిల్లలు కూడా తమ తల్లిదండ్రులకు గురువులుగా అక్షరజ్ఞానం బోధించాలని సూచించారు.

ఘనంగా ఆరోగ్య మాత జయంతి

గుంతకల్లు టౌన్, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): స్థానిక ఆరోగ్యమాత పుణ్యక్షేత్రంలో సోమవారం ఆరోగ్యమాత జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు తెలుగు, ఇంగ్లీష్, తమిళంలో పాస్టర్లు ప్రార్థనలు చేశారు. సాయంత్రం ఆరోగ్యమాత ఉత్సవమూర్తిని పల్లకిలో ఊరేగించారు.

అర్హులకు ఇంటి పట్టాలివ్వాలి

కణేకల్లు, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): స్థానిక ఇందిరమ్మకాలనీలో అర్హులకు ఇంటిపట్టాలు ఇవ్వాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం తహసీల్దార్ కార్యాలయం ముందు రిలే నిరాహారదీక్ష చేపట్టారు. తహసీల్దార్ బ్రహ్మయ్యకు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా కార్యదర్శి సంజీవప్ప, గౌస్‌పీర్, ముల్లాసర్మాస్, దాదాపీర్, అనుమేష్ పాల్గొన్నారు.

సీఎం సభను విజయవంతం చేద్దాం


ఉరవకొండలో మాట్లాడుతున్న మంత్రి పయ్యావుల కేశవ్

ఉరవకొండ, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): అనంతపురంలో బుధవారం జరిగే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సూపర్‌సిక్స్ సభను నాయకులు, కార్యకర్తలు ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని విజయవంతం చేయాలని ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ సూచించారు. సీఎం సభ సమన్వయకర్త చిలకూరిపేట ఎమ్మెల్యే పత్తిపాటి పుల్లారావుతో కలిసి స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో సోమవారం కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికారంలోకి వచ్చిన 16 నెలల్లోనే సూపర్‌సిక్స్ హామీలను సీఎం చంద్రబాబు నెరవేర్చారన్నారు. కార్యక్రమంలో ఏపీఐడీసీ మాజీ డైరెక్టర్ దేవినేని పురుషోత్తం, ఏఎంసీ మాజీ ఛైర్మన్లు రేగాటి నాగరాజు, మారెన్న, పట్టణ కన్వీనర్ రామాంజినేయులు, మండల కన్వీనర్ మారయ్య పాల్గొన్నారు.

సూపర్‌సిక్స్ సభకు తరలిరండి


కణేకల్లు సమావేశంలో పాల్గొన్న దేవినేని, కాలవ

కణేకల్లు, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఇప్పటివరకు జరగని విధంగా సూపర్‌సిక్స్ సూపర్‌హిట్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు కోరారు. సోమవారం స్థానిక పార్టీ నాయకులు, కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను కేవలం 16 నెలల్లోనే అమలు పరచిన ఘనత టీడీపీదే అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర రైతు మిషనరీ ఉపాధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, స్థానిక టీడీపీ నాయకులు లాలెప్ప, ఆది, కళేకుర్తి సుదర్శన్, బీటీ రమేష్, చంద్రశేఖర్‌గుప్తా పాల్గొన్నారు.

● బొమ్మనహాళ్ : మండలంలోని దేవగిరిక్రాస్‌లో టీడీపీ నాయకులు మల్లీడు శ్రీనివాసులు స్వగృహం వద్ద టీడీపీ కార్యకర్తల సమావేశం సోమవారం ఏర్పాటు చేశారు. ఇందులో రాష్ట్ర ప్రభుత్వ విప్, రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ, సూపర్‌సిక్స్ సూపర్‌హిట్ అబ్జర్వర్ దేవినేని ఉమామహేశ్వరరావు, రాష్ట్ర వ్యవసాయ మిషన్ ఛైర్మెన్ మర్రెడ్డి శ్రీనివాసరెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో టీబీ ప్రాజెక్టు కమిటీ వైస్ ఛైర్మెన్ కేశవరెడ్డి, మండల కన్వీనర్ బలరాంరెడ్డి, టీడీపీ నాయకులు కొత్తపల్లి మల్లికార్జున, జగన్నాథ్‌రెడ్డి, చలపతి, మహేంద్ర, పయ్యావుల నాగరాజు, పయ్యావుల అనిల్ పాల్గొన్నారు.

సీఎం సభను దిగ్విజయం చేయండి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం

గుంతకల్లు, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో అనంతపురంలో బుధవారం నిర్వహించనున్న సూపర్ సిక్స్-సూపర్ హిట్ సభను జయప్రదం చేయాలని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం పిలుపునిచ్చారు. సోమవారం పాతగుంతకల్లులోని బీరప్ప దేవాలయం వద్ద ఉన్న గుంతకల్లప్ప స్వామి కల్యాణమండపంలో టీడీపీ నాయకుడు గుమ్మనూరు నారాయణస్వామి ఆధ్వర్యంలో నియోజకవర్గ టీడీపీ నాయకులు, కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఈ సభను జయప్రద చేయడానికి అన్ని ఏర్పాట్లు చేశామని, 45 వేల మందికి తగ్గకుండా హాజరుకావాలని కార్యకర్తలకు సూచించారు. కార్యక్రమంలో టీడీపీ పరిశీలకులు ఎమ్మెల్సీ ఆలపాటి రాజా, బ్రాహ్మణ కార్పొరేషన్ ఛైర్మన్ బూచి రాంప్రసాద్, నాయకులు వాసగిరి మణికంఠ, కేసీ హరి, బండారు ఆనంద్ పాల్గొన్నారు.

సీఎం కార్యక్రమానికి తరలిరండి


కార్యక్రమంలో పాల్గొన్న అశ్మిత్ రెడ్డి, అమర్‌నాథ్‌రెడ్డి, ఏరాసు ప్రతాప్‌రెడ్డి

తాడిపత్రి, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): అనంతపురంలో బుధవారం ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్వహించే సూపర్‌సిక్స్ - సూపర్ హిట్ కార్యక్రమానికి పెద్దఎత్తున తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక నివాసంలో పలమనేరు ఎమ్మెల్యే అమర్‌నాథ్‌రెడ్డి, నియోజకవర్గ పరిశీలకుడు ఏరాసు ప్రతాప్‌రెడ్డితో కలిసి నియోజకవర్గంలోని నాయకులతో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పటికే నియోజకవర్గం నుంచి సొంత వాహనాలతోపాటు బస్సులను కూడా ఏర్పాటు చేశామన్నారు.

ప్రజలు స్వచ్ఛందంగా వస్తారు


దేవినేని ధర్మతేజ, పరిశీలకులను సన్మానిస్తున్న నాయకులు

కళ్యాణదుర్గం, సెప్టెంబరు8(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో బుధవారం నిర్వహించే సూపర్ సిక్స్-సూపర్ హిట్ కార్యక్రమానికి ప్రజలు స్వచ్ఛందంగా తరలివస్తారని టీడీపీ నాయకులు దేవినేని ధర్మతేజ అన్నారు. సోమవారం కంబదూరు, కుందుర్పి, శెట్టూరు, బ్రహ్మసముద్రం, కళ్యాణదుర్గం రూరల్, కళ్యాణదుర్గం మున్సిపాలిటీ మండలాల్లో సీఎం పర్యటనపై పరిశీలకులు కిమిడి నాగార్జున, నాగేశ్వర్ యాదవ్‌తో కలిసి నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కళ్యాణదుర్గం నియోజకవర్గం నుంచే సుమారు 10 వేల నుంచి 20 వేల దాకా తరలిరావాలని పిలుపునిచ్చారు. సీఎం సభకు వచ్చే వారికి బస్సుల సౌకర్యాలు కూడా ఏర్పాటు చేశామన్నారు.

ప్రైవేటీకరణ వద్దు

కళ్యాణదుర్గం రూరల్, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పది ప్రభుత్వ వైద్య కళాశాల ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో అంబేద్కర్ సర్కిల్ వద్ద సోమవారం నిరసన తెలిపారు. నియోజకవర్గ కోశాధికారి పవన్ మాట్లాడుతూ.. పీపీపీ విధానం అమలు చేస్తే వందలాది మంది ప్రతిభగల విద్యార్థులకు ఎంబీబీఎస్ విద్య దూరమవుతుందన్నారు. కార్యక్రమంలో తాలుకా ఉపాధ్యక్షులు హర్షవర్దన్, సహాయ కార్యదర్శి రజిని కుమార్, బాబు, నాయకులు శివ, మున్నా పాల్గొన్నారు.

11న హుండీ లెక్కింపు

తాడిపత్రి, సెప్టెంబరు8(ఆంధ్రజ్యోతి): స్థానిక చింతల వెంకటరమణస్వామి ఆలయ హుండీ లెక్కింపును గురువారం ఉదయం 10గంటలకు లెక్కిస్తామని ఈఓ రామాంజనేయులు తెలిపారు. ఆసక్తిగల భక్తులు పాల్గొనవచ్చునని ఆయన సూచించారు.